TGTEL/26/A6221

# తొలివెలుగు

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం.. జాతీయపత్రిక

TOLE VELUGGU JATIYAPATRIKA

| యాదాద్రిభువనగిరి | సంపుటి: 01 | సంచిక. 70 | మంగళవారం | 6.అక్టోబర్.2026 | ఎడిటర్: యంజాల ప్రవీణ్ | పేజీలు: 8 | వెల రూ. 2/ |
|---|---|---|---|---|---|---|---|
| Yadadri Bhuvangiri | Volume: 01 | Issue. 70 | Tuesday | 6.10.2026 | Editor: Yamjala Praveen | pages: 8 | cost. 2/ |


విలేకరులు కావలెను

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9491134365


## రాజ్యసభ ఎన్నికలు..
# సిట్టింగ్ ఎంపీలకు బీజేపీ షాక్

2

- యూపీలో మొత్తం 8 మంది సిట్టింగ్ ఎంపీలకు నో ఛాన్స్
- హర్దీప్ సింగ్ పురీ, బీఎల్ వర్మ సహా ఏడుగురికి మళ్లీ దక్కని అవకాశం



## సింగరేణి కార్మికులకు రూ.1.10 లక్షల బోనస్

2

- దసరా, దీపావళి కానుకగా ఒక్కొక్కరికి రూ.1,10,250
- కార్మికుల శ్రమ వెలకట్టలేనిది
- కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి



## కృష్ణా జలాల్లో ప్రతి చుక్కా
# సద్వినియోగం

### ప్రాజెక్టుల కేటాయింపులు, వినియోగంపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలి



- మిగులు జలాల వినియోగానికి కొత్త అవకాశాలు గుర్తించాలి
- కృష్ణలో ఎక్కువ వాటా కోసం కృషి చేయాలి
- డిండి పనులు వేగవంతం చేయాలి
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- కాళేశ్వరం అదనపు టీఎంసీ పనులు, డిండి ఎత్తిపోతలు, బ్యారేజీల పునరుద్ధరణపై రేవంత్ సమీక్ష

కృష్ణా నది పరీవాహక ప్రాంతంలో అందుబాటులో ఉన్న జలాలను పూర్తిస్థాయిలో వినియోగించుకునే అవకాశాలను గుర్తించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం ప్రాజెక్టుల వారీగా కేటాయించిన నీటిని మినహాయించగా ఇంకా వినియోగించుకునే అవకాశం ఉన్న జలాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించినట్లు సమాచారం.

**హైదరాబాద్:** కృష్ణా నది పరీవాహక ప్రాంతంలో అందుబాటులో ఉన్న జలాలను పూర్తిస్థాయిలో వినియోగించుకునే అవకాశాలను గుర్తించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం ప్రాజెక్టుల వారీగా కేటాయించిన నీటిని మినహాయించగా ఇంకా వినియోగించుకునే అవకాశం ఉన్న జలాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించినట్లు సమాచారం. కృష్ణా జలాల్లో రాష్ట్రానికి మరింత వాటా సాధించేందుకు అవసరమైన చర్యలపై దృష్టి పెట్టాలని సీఎం స్పష్టం చేసినట్లు తెలిసింది. సోమవారం రాత్రి నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి నీటిపారుదల ప్రాజెక్టులపై సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించినట్లు సమాచారం. శాఖ కార్యదర్శి ఇ. శ్రీధర్, ఈఎన్‌సీ రమేశ్‌బాబు, పలువురు చీఫ్ ఇంజినీర్లు సమావేశంలో పాల్గొన్నారు. కృష్ణా బేసిన్‌లోని ప్రాజెక్టులు, వాటికి ఉన్న కేటాయింపులు, ఇప్పటివరకు జరిగిన నీటి వినియోగం, భవిష్యత్తులో చేపట్టాల్సిన పనులపై ఈ సందర్భంగా చర్చించినట్లు తెలిసింది.

**బేసిన్‌పై సమగ్ర నివేదిక**

కృష్ణా పరీవాహక ప్రాంతంలో ప్రస్తుతం ఉన్న ప్రాజెక్టులు, వాటి కేటాయింపులు, నీటి వినియోగంపై సమగ్ర వివరాలను సేకరించాలని సీఎం సూచించినట్లు సమాచారం. ఇంకా నీటిని వినియోగించుకునేందుకు అనువైన ప్రాంతాలు, కొత్త ప్రాజెక్టుల నిర్మాణానికి ఉన్న అవకాశాలను గుర్తించాలని ఆదేశించినట్లు తెలిసింది. కేటాయించిన జలాలను పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా కార్యాచరణ రూపొందించాలని, కృష్ణా జలాల్లో రాష్ట్రానికి ఎక్కువ వాటా దక్కేలా ప్రయత్నించాలని సూచించినట్లు సమాచారం. "కృష్ణా జలాలపై సమగ్ర నివేదిక సిద్ధం చేయండి. ప్రాజెక్టుల వారీగా కేటాయింపులు, వినియోగం, మిగిలిన అవకాశాలను స్పష్టంగా పొందుపరచాలి. నివేదిక సిద్ధమైన తర్వాత దీనిపై మరోసారి ప్రత్యేకంగా చర్చిద్దాం" అని సీఎం అధికారులకు సూచించినట్లు తెలిసింది.

**కాలువలు లేకుంటే పెట్టుబడులు వృథానే**

ప్రాజెక్టుల నిర్మాణానికి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నప్పటికీ ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీరు అందకపోవడంపై సీఎం అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. కాళేశ్వరం అదనపు టీఎంసీ పనుల్లో భూసేకరణ, పునరావాసం, కాలువల నిర్మాణం వంటి అంశాలను సకాలంలో పూర్తి చేయకపోవడంతో భారీగా నిధులు ఖర్చయినా ఆశించిన ప్రయోజనం అందడం లేదని పేర్కొన్నట్లు తెలిసింది. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మధ్యమానేరు మీదుగా మల్లన్నసాగర్ వరకు చేపట్టిన అదనపు టీఎంసీ పనుల పురోగతిని సీఎం అడిగి తెలుసుకున్నట్లు సమాచారం. ఈ పనుల్లో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి పరిష్కార మార్గాలను సూచించేలా నివేదిక ఇవ్వాలని ఆదేశించినట్లు తెలిసింది.

శ్రీపాద ఎల్లంపల్లి నుంచి మధ్యమానేరు వరకు నాలుగు, మధ్యమానేరు నుంచి మల్లన్నసాగర్ వరకు మరో నాలుగు ప్యాకేజీల్లో పనులు చేపట్టినట్లు అధికారులు వివరించినట్లు సమాచారం. మొదటి దశలోని నాలుగు ప్యాకేజీలకు రూ.32,060 కోట్ల అంచనా వ్యయం ఉండగా 52 శాతం పనులు పూర్తయ్యాయని, రెండో దశలోని నాలుగు ప్యాకేజీల్లో 61 శాతం పనులు పూర్తయ్యాయని వివరించినట్లు తెలిసింది. ఇప్పటివరకు సుమారు రూ.18 వేల కోట్లు ఖర్చు చేసినప్పటికీ మరో రూ.2,200 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, భూసేకరణ సమస్యలు కూడా ఉన్నాయని అధికారులు వెల్లడించినట్లు సమాచారం. దీనిపై సీఎం స్పందిస్తూ.. భూసేకరణ పూర్తి చేయకుండా ప్రధాన పనులు చేపడితే ప్రయోజనం ఏమిటని ప్రశ్నించినట్లు తెలిసింది. "అంతిమంగా ఆయకట్టుకు నీరు అందాలి. అందుకు అవసరమైన భూసేకరణ, కాలువల నిర్మాణం వంటి పనులను సమాంతరంగా పూర్తి చేయాలి" అని సూచించినట్లు సమాచారం.

**డిండి పనులు వేగవంతం చేయాలి**

డిండి ఎత్తిపోతల పథకంపైనా సమావేశంలో చర్చించినట్లు తెలిసింది. డిండికి నీటి కేటాయింపులకు సంబంధించిన అంశాన్ని ప్రభుత్వం పరిష్కరిస్తుందని, ఇంజినీర్లు మాత్రం క్షేత్రస్థాయిలో పనులను వేగంగా ముందుకు తీసుకెళ్లాలని సీఎం సూచించినట్లు సమాచారం. నీటి కేటాయింపుల సమస్యను ప్రభుత్వ స్థాయిలో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని, పనుల విషయంలో ఎలాంటి జాప్యం ఉండకూడదని స్పష్టం చేసినట్లు తెలిసింది.

**బ్యారేజీల పునరుద్ధరణపై ఆరా**

కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ అంశంపైనా సీఎం అధికారులను ప్రశ్నించినట్లు సమాచారం. బ్యారేజీలపై నిర్వహిస్తున్న పరీక్షలు, పునరుద్ధరణ తరువాయి 2 లో

## చట్టవిరుద్ధమైతే
# రద్దుచేస్తాం

- ఫారం-6లో మార్పుల్ని మేం చేయలేదు
- ఈసీ నిర్ణయాలపై సుప్రీంకోర్టు
- సీఈసీ, కేంద్రానికి నోటీసులు
- జ్ఞానేశ్ నిలువరించేలా ఉత్తర్వుల జారీకి నిరాకరణ



2

## నేరం చేయాలంటేనే
# వణుకుపుట్టాలి

- గూండాలు, సంఘవ్యతిరేక శక్తులపై కఠిన చర్యలుండాలి
- ఢిల్లీలో వరుస అత్యాచార ఘటనలపై అత్యున్నత న్యాయ స్థానం

# సవాళ్లను అధిగమిస్తాం

- ప్రపంచం 'ఫ్లక్స్' యుగంలోకి.. ఛాలెంజ్‌ను ఎదుర్కోవడమే ముందున్న కర్తవ్యం
- అనిశ్చితి, ఘర్షణలు, అస్థిరతతో అంతర్జాతీయ పరిస్థితులు
- ఆహారం, ఇంధనం, ఎరువులపై ప్రభావాన్ని ముందే అంచనా వేసి సిద్ధం కావాలి
- గ్లోబల్ సౌత్ దేశాల సమస్యలను ప్రపంచ వేదికలపై భారత్ బలంగా వినిపిస్తోంది
- విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్



2



అంతర్జాతీయ దౌత్యం, గ్లోబల్ గవర్నెన్స్, సాంకేతిక రంగాల్లో భారత్ కీలక శక్తిగా ఎదుగుతోందని స్విట్జర్లాండ్ అధ్యక్షుడు గై పార్మెలిన్ ప్రశంసించారు. ప్రపంచం రాజకీయ, భౌగోళిక విభజనలను ఎదుర్కొంటున్న సమయంలో భారత్ వంటి దేశాలతో భాగస్వామ్యం మరింత అవసరమని పేర్కొన్నారు.

# భారత్ శక్తిగా ఎదుగుతోంది

- ఏఐ, వాణిజ్య రంగాల్లో కలిసి పనిచేస్తాం
- స్విస్ అధ్యక్షుడు గై పార్మెలిన్
- 2027 గ్లోబల్ ఏఐ సదస్సుకు భారత్‌ను కీలక భాగస్వామిగా ఆహ్వానం

2





## 2027 డిసెంబర్‌కు
# 67 యంగ్ ఇండియా స్కూళ్లు

2

- 119 నియోజకవర్గాల్లో పాఠశాలల ఏర్పాటే లక్ష్యం
- 2028 జూన్ నాటికి 87 స్కూళ్లు పూర్తి చేయాలి: సీఎస్ సంజయ్ జాజు
- ఫ్యూచర్ సిటీలో విదేశీ వర్సిటీల క్యాంపస్‌లకు ప్రత్యేక పాలసీ

## మూడు డిమాండ్లపై
# రాజీపడే ప్రసక్తే లేదు

- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాల్సిందే
- ఎస్ఐఆర్ రద్దు.. ఈవీఎంలకు బదులు బ్యాలెట్ పేపర్‌తో ఎన్నికలు నిర్వహించాలి
- కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే



2



## వారసత్వ కట్టడాలను
# కూల్చివేసే కుట్ర

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే కేటీఆర్

## నిత్యావసర ధరలపై
# ఉదాసీనత దారుణం

- మాజీ మంత్రి హరీశ్‌రావు





## వైద్యశాస్త్రంలో
# ముగ్గురికి నోబెల్

2

- ఆప్టోజెనెటిక్స్ ఆవిష్కర్తలకు వైద్య నోబెల్
- కార్ల్ డిసెరోత్, పీటర్ హెగెమన్, జార్జ్ నగెల్‌కు సంయుక్తంగా పురస్కారం
- కాంతి నియంత్రిత అయాన్ ఛానల్స్‌పై విశేష పరిశోధనకు గుర్తింపు
- నేడు భౌతికశాస్త్రం.. బుధవారం రసాయనశాస్త్రం అవార్డుల ప్రకటన

# చట్టవిరుద్ధంగా, ఏకపక్షంగా మార్చారు

2

- ఫారం-6 మార్పు.. సీఈసీపై రాహుల్ ఫైర్!
- సుప్రీంకోర్టు ఆమోదించలేదని స్పష్టీకరణ
- బాధ్యులందరినీ జవాబుదారీ చేస్తామన్న కాంగ్రెస్ అగ్రనేత



**న్యూఢిల్లీ:** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో ఉపయోగిస్తున్న ఫారం-6లో మార్పులపై రాజకీయ దుమారం కొనసాగుతోంది. ఆ మార్పులను సుప్రీంకోర్టు ఆమోదించలేదని స్పష్టం చేసిన నేపథ్యంలో.. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు చేశారు. ఫారం-6ను జ్ఞానేశ్ కుమార్ "చట్టవిరుద్ధంగా, ఏకపక్షంగా" మార్చారని ఆరోపించారు. ఈ వ్యవహారంలో బాధ్యులైన ప్రతి ఒక్కరినీ జవాబుదారీ చేస్తామని పేర్కొన్నారు. "జ్ఞానేశ్ కుమార్ ఫారం-6ను చట్టవిరుద్ధంగా, ఏకపక్షంగా మార్చారనేది ఇప్పుడు నిస్సందేహంగా రుజువైంది. భాజపాకు సహాయం చేసేందుకు ఆయన తన పదవిని దుర్వినియోగం చేస్తున్నారనడానికి ఇది మరో రుజువు" అని రాహుల్ గాంధీ ఎక్స్‌లో ఆరోపించారు. ప్రజాస్వామ్యంపై జరిగిన ఈ దాడికి బాధ్యులైన వారందరినీ జవాబుదారీ చేస్తామని హెచ్చరించారు. తన ఆరోపణలకు మద్దతుగా గతంలో తరువాయి 2 లో

# కృష్ణా జలాల్లో ప్రతి చుక్కా సద్వినియోగం

(మొదటి పేజీ తరువాయి)

డిజైన్లు, పనుల ప్రణాళికలు ఏ దశలో ఉన్నాయో వివరాలు అడిగి తెలుసుకున్నట్లు తెలిసింది. ప్రాజెక్టుల కింద అవసరమైన భూసేకరణను వేగంగా పూర్తి చేయాలని సీఎం ఆదేశించినట్లు సమాచారం. ఇందుకోసం ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తున్నప్పటికీ జాప్యం ఎందుకు జరుగుతోందని ప్రశ్నించినట్లు తెలిసింది. ప్రాజెక్టుల వారీగా ఎంత భూమి అవసరం, ఇప్పటివరకు ఎంత సేకరించారు, మిగిలిన భూసేకరణకు ఎంత సమయం పడుతుందనే వివరాలను సేకరించాలని సూచించినట్లు సమాచారం. ప్రతి ప్రాజెక్టులో ఎదురవుతున్న అవరోధాలను గుర్తించి, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలతో సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించినట్లు తెలిసింది.

## సింగరేణి కార్మికులకు రూ.1.10 లక్షల బోనస్

**హైదరాబాద్:** దసరా, దీపావళి పండగలను పురస్కరించుకుని సింగరేణి కార్మికులకు భారీ బోనస్ ప్రకటించారు. ఒక్కో కార్మికుడికి రూ.1,10,250 చొప్పున బోనస్ ఇవ్వాలని నిర్ణయించినట్లు కేంద్ర మంత్రి, తెలంగాణ భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. దేశానికి వెలుగులు అందించేందుకు సింగరేణి కార్మికులు పగలు, రాత్రి తేడా లేకుండా శ్రమిస్తున్నారని కిషన్‌రెడ్డి కొనియాడారు. వారి సేవలు, కృషి వెలకట్టలేనివని పేర్కొన్నారు. సింగరేణి కేవలం బొగ్గు ఉత్పత్తి సంస్థ మాత్రమే కాదని.. తెలంగాణకు కొంగు బంగారమని అభివర్ణించారు. లక్షలాది కుటుంబాలకు ఈ సంస్థ జీవనాధారంగా నిలుస్తోందన్నారు. రాష్ట్ర, దేశ అభివృద్ధిలో సింగరేణి కీలక భాగస్వామిగా మరింత ముందుకు సాగాల్సిన అవసరం ఉందని కిషన్‌రెడ్డి అన్నారు. కార్మికుల సంక్షేమం, ఉద్యోగ భద్రత, భవిష్యత్తు ప్రయోజనాలపై యాజమాన్యం ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రస్తుత అవసరాలతో పాటు భవిష్యత్తు డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని బొగ్గు ఉత్పత్తిని పెంచేందుకు సమగ్ర ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని కోరారు.
తెలంగాణ అభివృద్ధితో పాటు దేశ ప్రగతిలోనూ సింగరేణి మరింత కీలకపాత్ర పోషించాలని ఆకాంక్షించారు. సంస్థకు తెలంగాణ ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.60 వేల కోట్లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సింగరేణి కార్మికులు, ఉద్యోగులు, వారి కుటుంబసభ్యులకు దసరా, దీపావళి పండగల సందర్భంగా కిషన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

## వారసత్వ కట్టడాలను కూల్చివేసే కుట్ర

హైదరాబాద్: తెలంగాణ వారసత్వ కట్టడాలను కూల్చడానికి రేవంత్‌రెడ్డి సర్కారు కుట్రలు పన్నుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. సోమవారం ఆయన ఈ అంశంపై 'ఎక్స్'లో పోస్ట్ పెట్టారు. "కాంగ్రెస్ ప్రభుత్వానికి భూములు దోచుకోవడం అయిపోయింది. ఇప్పుడు భూమి లోపల ఉన్న సంపదను కొల్లగొట్టి.. వారసత్వ సంపదను దెబ్బతీసే కుట్రలకు తెరతీసింది. రామప్ప దేవాలయానికి అతి సమీపంలో ఓపెన్ కాస్ట్ బొగ్గు గని ఏర్పాటు చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమవడం దారుణం. వారసత్వ సంపదను ధ్వంసం చేసే ఈ వైఖరిని భారాస పార్టీ వ్యతిరేకిస్తుంది. రామప్ప దేవాలయానికి హాని చేసే ఓపెన్ కాస్ట్ బొగ్గు గని ప్రతిపాదనను వెంటనే వెనక్కి తీసుకోకుంటే ఉద్యమిస్తాం" అని కేటీఆర్ హెచ్చరించారు.

## నేరం చేయాలంటేనే వణుకుపుట్టాలి

**ఢిల్లీ:** "నేరం చేస్తే తప్పించుకోలేమన్న భయం గూండాలు, సంఘవ్యతిరేక శక్తుల మెదళ్లలో నాటుకుపోయేలా చేయకపోతే మహిళలపై జరుగుతున్న ఘోరాలను నిలువరించలేం. తప్పుగా ప్రవర్తించాలన్న ఆలోచన వస్తేనే వారికి వణుకుపుట్టాలి. మహిళల భద్రతకు సంబంధించిన చర్యలు కాగితాలకే పరిమితం కాకూడదు. మేం సురక్షితంగా ఉన్నామని ప్రతి మహిళ, బాలిక భావించేలా కార్యాచరణ ఉండాలి. రాత్రి 11 గంటల సమయంలో కూడా దిల్లీ-దేశ రాజధాని ప్రాంతంలో మహిళలు రోడ్లపై, మెట్రోలో స్వేచ్ఛగా, భద్రంగా తిరిగే పరిస్థితులు కల్పించాలి' అని దిల్లీ పోలీసులకు సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. దేశరాజధాని దిల్లీలో మహిళలకు రక్షణలేదన్న భావన వ్యక్తమవుతోందని, దానిని తక్షణమే సరిచేయాల్సి ఉందని జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ కె.వినోద్ చంద్రన్ ధర్మాసనం పేర్కొంది. నేరాలు జరిగిన తర్వాత ఏం చేశామన్న దానికంటే వాటిని ముందే నివారించడం అత్యంత ముఖ్యమైన అంశమని తెలిపింది. ఇటీవల దిల్లీలో బాలికలపై జరిగిన సామూహిక అత్యాచారాలు, స్లీపర్ బస్సులో మైనర్ బాలికపై లైంగిక దాడి కేసులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన సుప్రీంకోర్టు సుమోటోగా విచారణ చేపట్టిన విషయం తెలిసిందే. దీనిపై సోమవారం విచారణ సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. 'ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేలా పోలీసులు పనిచేయాలి. మిమ్మల్ని చూసి ప్రజలు భయపడకూడదు. మీదగ్గరకు వచ్చి అన్ని విషయాలు తెలిపేలా ఉండాలి' అని దిల్లీ పోలీసులకు సూచించింది. మహిళలపై నేరాల కట్టడికి కఠిన నిర్ణయాలు తీసుకోవచ్చని తెలిపింది. "మానవహక్కుల వంటి సమస్యలు ఎదురైనా వెనక్కి తగ్గవద్దు. మన లక్ష్యం మహిళలు, బాలికలకు భద్రత కల్పించడం" అని కోర్టు పేర్కొంది. బహిరంగ ప్రదేశాల్లో పెట్రోలింగ్‌ను మరింత పెంచాలని సూచించింది.

## నిత్యావసర ధరలపై ఉదాసీనత దారుణం

**హైదరాబాద్:** నిత్యావసరాల ధరలు సామాన్యుడిపై పెనుభారంగా మారుతుంటే.. ధరలకు అడ్డుకట్ట వేయాల్సిన ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరించడం దారుణమని మాజీ మంత్రి హరీశ్‌రావు ఒక ప్రకటనలో విమర్శించారు. "సన్నబియ్యం ధరలు కేవలం నాలుగు నెలల్లోనే 25 శాతం పెరగడం ప్రభుత్వానికి కనిపించడం లేదా? రికార్డు స్థాయిలో పంట ఉత్పత్తి సాధించామని గొప్పలు చెప్పుకొంటున్న ప్రభుత్వం.. మరి ఉత్పత్తి పెరిగినప్పుడు ధరలు తగ్గాల్సింది పోయి.. బియ్యం ధరలు ఎందుకు ఆకాశాన్ని అంటుతున్నాయో సమాధానం చెప్పాలి? అక్రమ నిల్వల బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. నిత్యావసరాల ధరలకు వెంటనే అడ్డుకట్ట వేయాలి" అని డిమాండ్ చేశారు.

## రాజ్యసభ ఎన్నికలు.. సిట్టింగ్ ఎంపీలకు బీజేపీ షాక్

**న్యూఢిల్లీ:** రాజ్యసభ ఎన్నికల వేళ బీజేపీ కీలక నిర్ణయం తీసుకుంది. ఉత్తర్‌ప్రదేశ్‌లో ఖాళీ కానున్న 10 రాజ్యసభ స్థానాలకు గాను ఎనిమిది మంది అభ్యర్థులను సోమవారం ప్రకటించింది. వీరిలో ఒక్కరు కూడా ప్రస్తుత సిట్టింగ్ ఎంపీ కాకపోవడం గమనార్హం. కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పురీ, సహాయ మంత్రి బీఎల్ వర్మతో పాటు అరుణ్ సింగ్, సీమా ద్వివేది, నీరజ్ శేఖర్, బ్రిజ్‌లాల్, గీతా శాక్యలకు పార్టీ మళ్లీ అవకాశం ఇవ్వలేదు. మరో సిట్టింగ్ సభ్యుడు దినేశ్ శర్మ ఇప్పటికే రాజ్యసభకు రాజీనామా చేసి అండమాన్- నికోబార్ దీవుల లెఫ్టినెంట్ గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టారు. దీంతో యూపీ నుంచి పదవీకాలం ముగుస్తున్న భాజపా ఎంపీల్లో ఒక్కరికీ పునర్నామినేషన్ దక్కలేదు. యూపీ నుంచి భాజపా బరిలోకి దింపిన వారిలో ధర్మపాల్ సింగ్, రాధాకాంత్ ఓఝా, ప్రకాశ్ పాల్, విద్యాసాగర్ సోంకర్, గోపీ కృష్ణ పాండే, ప్రియాంక సింగ్ రావత్, రామ్ ప్రతాప్ సింగ్ చౌహాన్, శ్రుతి గంగ్వార్ ఉన్నారు. పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ వీరి పేర్లను ఆమోదించింది. యూపీ నుంచి రాజ్యసభకు 10 స్థానాలకు అక్టోబరు 16న ఎన్నికలు జరగనున్నాయి. ప్రస్తుత అసెంబ్లీ బలాబలాల ప్రకారం భాజపా నేతృత్వంలోని ఎన్డీయేకు ఎనిమిది స్థానాలు దక్కే అవకాశం ఉంది. సమాజ్‌వాదీ పార్టీ రెండు స్థానాల్లో గెలిచే స్థితిలో ఉంది. పశ్చిమ బెంగాల్ నుంచి రుక్మిణి మల్లిక్, ఉత్తరాఖండ్ నుంచి దినేశ్ ఆర్యను భాజపా ఇప్పటికే అభ్యర్థులుగా ప్రకటించింది. అక్టోబరు 16న ఈ రెండు రాష్ట్రాల్లోనూ ఎన్నికలు జరగనున్నాయి. ఉత్తరాఖండ్‌లో ఒక రాజ్యసభ స్థానం, పశ్చిమ బెంగాల్‌లో ఒక స్థానానికి ఉపఎన్నిక జరగనుంది. రుక్మిణి మల్లిక్ గతంలో తృణమూల్ కాంగ్రెస్ తరఫున రాజ్యసభ సభ్యురాలిగా ఉన్నారు.

## 2027 డిసెంబరుకు 67 యంగ్ ఇండియా స్కూళ్లు

**హైదరాబాద్:** రాష్ట్రంలో 67 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణాన్ని 2027 డిసెంబరు నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. యంగ్ ఇండియా స్కూళ్ల నిర్మాణం, ఫ్యూచర్ సిటీలో అంతర్జాతీయ విద్యాసంస్థల ఏర్పాటుపై సోమవారం సచివాలయంలో ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా పాఠశాలలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని సీఎస్ తెలిపారు. ఇందులో భాగంగా 2027 డిసెంబరుకు 67, 2028 జూన్ నాటికి 87 పాఠశాలలను పూర్తి చేసేలా పనులను వేగవంతం చేయాలని సూచించారు. నిర్మాణ పనుల్లో ఎదురవుతున్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ నిర్ణీత గడువులోగా ప్రాజెక్టులను పూర్తి చేయాలని ఆదేశించారు. ఫ్యూచర్ సిటీలో ప్రముఖ అంతర్జాతీయ విశ్వవిద్యాలయాల క్యాంపస్‌ల ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. పలు అంతర్జాతీయ వర్సిటీలు ఫ్యూచర్ సిటీలో తమ క్యాంపస్‌లను ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపుతున్నట్లు అధికారులు సమావేశంలో సీఎస్‌కు వివరించారు. విదేశీ విశ్వవిద్యాలయాలను రాష్ట్రానికి ఆకర్షించేలా మౌలిక వసతులు, పెట్టుబడులు, ఇతర అవసరాలను పరిగణనలోకి తీసుకుని ప్రత్యేక విధానాన్ని రూపొందించాలని సీఎస్ సూచించారు. క్యాంపస్‌ల ఏర్పాటుకు అవసరమైన అనుమతులు, సౌకర్యాలు తదితర అంశాలపై సమగ్ర కార్యాచరణ సిద్ధం చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ప్రముఖ కంపెనీలు గ్లోబల్ సమిట్‌లో విస్తృతంగా భాగస్వాములు అయ్యేలా చర్యలు తీసుకోవాలని సీఎస్ సూచించారు. సమిట్ ఏర్పాట్లపై వివిధ శాఖలు ఇప్పటివరకు సాధించిన పురోగతిని ఆయన సమీక్షించారు.

# సవాళ్లను అధిగమిస్తాం



**న్యూఢిల్లీ:** ప్రపంచవ్యాప్తంగా అనిశ్చితి, ఘర్షణలు, తీవ్ర అస్థిరత నెలకొన్న ప్రస్తుత పరిస్థితులను విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ 'ఫ్లక్స్ యుగం'గా అభివర్ణించారు. అంతర్జాతీయ పరిణామాలు వేగంగా మారుతున్న నేపథ్యంలో వాటి నుంచి ఎదురయ్యే సవాళ్లను సమర్థంగా ఎదుర్కోవడమే భారత్ ముందున్న ప్రధాన కర్తవ్యమని పేర్కొన్నారు. ప్రపంచంలో రెండు ప్రధాన ఘర్షణలతో పాటు అనేక ప్రాంతాల్లో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయని, సుంకాల విషయంలోనూ అనిశ్చితి నెలకొందని చెప్పారు. మార్కెట్ పరిధికి చెందని ఇతర అంశాల ప్రభావం కూడా అంతర్జాతీయ వ్యవస్థపై పెరుగుతోందన్నారు. న్యూఢిల్లీలో మూడు రోజుల పాటు జరిగిన 5వ కౌటిల్య ఎకనామిక్ కాన్‌క్లేవ్ ముగింపు కార్యక్రమంలో జైశంకర్ మాట్లాడారు. 'రెసిలియన్స్ ఇన్ యాన్ ఏజ్ ఆఫ్ ఫ్లక్స్' ఇతివృత్తంతో నిర్వహించిన సదస్సులో సింగపూర్ మాజీ విదేశాంగ మంత్రి జార్జ్ యోంగ్ బూన్ యోతో కలిసి ఆయన ఇంటరాక్టివ్ సెషన్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితులు, భారత్ ఎదుర్కొంటున్న సవాళ్లు, గ్లోబల్ సౌత్ దేశాల సమస్యలపై మాట్లాడారు.

**తుపాను తరంగాల్లాంటి పరిస్థితులు**

ప్రస్తుత ప్రపంచ భౌగోళిక, రాజకీయ పరిస్థితులు తీవ్ర అనిశ్చితి, అస్థిరతతో అల్లకల్లోలంగా ఉన్నాయని జైశంకర్ పేర్కొన్నారు. వివిధ దేశాల మధ్య ఘర్షణలు, ఉద్రిక్తతలు, సుంకాల్లో మార్పులు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతున్నాయని చెప్పారు. ప్రస్తుత పరిస్థితులను తుపాను తరంగాలతో పోల్చిన ఆయన.. ఇలాంటి సమయంలో ఎదురయ్యే సవాళ్లను ముందుగానే అంచనా వేసి, వాటికి అనుగుణంగా వ్యూహాలు రూపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కోవిడ్ మహమ్మారి సమయంలో భారత్ అనేక సవాళ్లను ఎదుర్కొని ముందుకు సాగిందని గుర్తుచేశారు. అదే విధంగా ప్రస్తుత సంక్షోభాలనూ సమర్థంగా ఎదుర్కొని ముందుకు వెళ్లగలమనే విశ్వాసం తనకు ఉందన్నారు. ప్రస్తుత ఘర్షణల ప్రభావం ఇంధనం, ఆహారం, ఎరువులు వంటి కీలక రంగాలపై పడే అవకాశం ఉన్నందున.. వాటిని ముందుగానే అంచనా వేసి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు.

**గ్లోబల్ సౌత్ గళం వినిపించాలి**

ప్రపంచ వేదికలపై గ్లోబల్ సౌత్ దేశాల సమస్యలను భారత్ బలంగా వినిపిస్తోందని జైశంకర్ చెప్పారు. ఆయా దేశాలు కూడా భారత్‌పై నమ్మకం ఉంచుతున్నాయని తెలిపారు. అభివృద్ధి చెందుతున్న, తక్కువ మరియు మధ్య ఆదాయ దేశాలకు ఆహారం, ఇంధనం, ఎరువులు, ఆర్థిక వనరులకు సంబంధించిన సమస్యలు ఉమ్మడిగా ఉన్నాయని వివరించారు. భారత్ ప్రస్తావిస్తున్న అంశాలు కేవలం తన ప్రయోజనాలకు సంబంధించినవి కాదని.. గ్లోబల్ సౌత్‌లోని అనేక దేశాల విస్తృత ప్రయోజనాలకు సంబంధించినవని జైశంకర్ పేర్కొన్నారు. ప్రపంచ వ్యవస్థలో అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రయోజనాలకు తగిన ప్రాధాన్యం దక్కేలా వాటి గళాన్ని వినిపించాల్సిన అవసరం ఉందన్నారు.

**రష్యా-ఉక్రెయిన్ సంక్షోభానికి దౌత్యమే మార్గం**

రష్యా-ఉక్రెయిన్ యుద్ధంపైనా జైశంకర్ మాట్లాడారు. ఈ సంక్షోభానికి చర్చలు, దౌత్య మార్గాల ద్వారానే పరిష్కారం సాధ్యమవుతుందని భారత్ తన వైఖరిని పునరుద్ఘాటించినట్లు తెలిపారు. యుద్ధం ముగింపునకు సంబంధించి సంబంధిత దేశాలతో భారత్ నేరుగా సంప్రదింపులు కొనసాగిస్తోందని చెప్పారు. అదే సమయంలో నల్ల సముద్రం నుంచి గల్ఫ్ ప్రాంతం వరకు వాణిజ్య నౌకలపై దాడులు జరగడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేశారు. అంతర్జాతీయ వాణిజ్యం, సరఫరా వ్యవస్థలపై ఘర్షణల ప్రభావం పడకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు.

**ఐరాసలో సంస్కరణలు అవసరం**

ప్రపంచవ్యాప్తంగా శాంతి, భద్రతల పరిరక్షణలో బహుపాక్షిక సంస్థల పాత్ర క్రమంగా తగ్గుతోందని జైశంకర్ ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఐక్యరాజ్యసమితి ప్రస్తుత వ్యవస్థ అనేక అంశాల్లో నిశ్చల స్థితికి చేరుకుందని పేర్కొన్నారు. ఐరాసలో అవసరమైన సంస్కరణలకు కొన్ని దేశాలు అడ్డంకులు సృష్టిస్తున్నాయని ఆయన వ్యాఖ్యానించారు. మారుతున్న ప్రపంచ పరిస్థితులకు అనుగుణంగా బహుపాక్షిక వ్యవస్థలను మరింత సమర్థంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.

# భారత్ కీలక శక్తిగా ఎదుగుతోంది



**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ దౌత్యం, గ్లోబల్ గవర్నెన్స్, సాంకేతిక రంగాల్లో భారత్ కీలక శక్తిగా ఎదుగుతోందని స్విట్జర్లాండ్ అధ్యక్షుడు గై పార్మెలిన్ ప్రశంసించారు. ప్రపంచం రాజకీయ, భౌగోళిక విభజనలను ఎదుర్కొంటున్న సమయంలో భారత్ వంటి దేశాలతో భాగస్వామ్యం మరింత అవసరమని పేర్కొన్నారు. అంతర్జాతీయ వేదికలపై చర్చలు, సహకారానికి భారత్ ఇస్తున్న ప్రాధాన్యాన్ని తాము కూడా అనుసరిస్తామని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆహ్వానం మేరకు మూడు రోజుల పర్యటనకు భారత్ వచ్చిన పార్మెలిన్.. సోమవారం మోదీతో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. అనంతరం విడుదల చేసిన ఉమ్మడి ప్రకటనలో ఇరు దేశాల మధ్య సంబంధాలపై పలు అంశాలను వెల్లడించారు.

**ఏఐలో భారత్ నాయకత్వం**

ప్రపంచ సాంకేతిక చర్చల్లో అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రాతినిధ్యాన్ని పెంచడంలో భారత్ అసాధారణ నాయకత్వాన్ని ప్రదర్శించిందని పార్మెలిన్ అన్నారు. 2026 ఫిబ్రవరిలో న్యూఢిల్లీలో జరిగిన 'ఏఐ ఇంపాక్ట్ సమిట్' విజయవంతమైందని ప్రశంసించారు. దీనికి 88 దేశాలు, అంతర్జాతీయ సంస్థలు మద్దతు తెలిపిన విషయాన్ని గుర్తుచేశారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రయోజనాలు ప్రపంచంలోని అన్ని ప్రాంతాలకు సమానంగా అందేలా చూడాల్సిన అవసరం ఉందన్నారు. ఏఐ పరిశోధనలు, అంతర్జాతీయ భాగస్వామ్యాలకు స్విట్జర్లాండ్ ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. 2027 జూన్‌లో జెనీవాలో నిర్వహించనున్న గ్లోబల్ ఏఐ సదస్సుకు భారత్‌ను కీలక భాగస్వామిగా పరిగణిస్తున్నట్లు వెల్లడించారు. న్యూదిల్లీ డిక్లరేషన్ ఆన్ ఏఐ ఇంపాక్ట్‌లోని మార్గదర్శకాల ఆధారంగా ముందుకు సాగుతామని చెప్పారు.

**టీఈపీఏతో వాణిజ్య బంధం బలోపేతం**

భారత్-యూరోపియన్ ఫ్రీ ట్రేడ్ అసోసియేషన మధ్య కుదిరిన ట్రేడ్ అండ్ ఎకనామిక్ పార్టనర్‌షిప్ అగ్రిమెంట్ ఇరు దేశాల ఆర్థిక సంబంధాలను మరింత బలోపేతం చేస్తోందని పార్మెలిన్ తెలిపారు. భారత్‌తో పాటు స్విట్జర్లాండ్, నార్వే, ఐస్‌లాండ్, లిక్టెన్‌స్టెయిన్ సభ్యులుగా ఉన్న జుఖీరూతో ఈ ఒప్పందం 2025 అక్టోబరు 1 నుంచి అమల్లోకి వచ్చింది. ఒప్పందం అమలుపై తాము సంతృప్తిగా ఉన్నామని, స్విస్ కంపెనీల్లో భారత్‌పై ఆసక్తి పెరిగిందని చెప్పారు. స్విట్జర్లాండ్‌కు అత్యాధునిక సాంకేతికత, పెట్టుబడి సామర్థ్యం, అంతర్జాతీయ కంపెనీలు ఉండగా.. భారత్‌కు భారీ మార్కెట్, నైపుణ్యమున్న మానవ వనరులు, వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ ఉన్నాయని పార్మెలిన్ వివరించారు. ఈ పరస్పర బలాలు ఇరు దేశాలకు కొత్త అవకాశాలను సృష్టిస్తున్నాయని పేర్కొన్నారు. రవాణా, లాజిస్టిక్స్, ఆర్థిక సేవలు, ఫార్మాస్యూటికల్స్, బయోటెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ తదితర రంగాల్లో స్విస్ కంపెనీలు భారత్‌లో పెట్టుబడులు పెడుతున్నాయని తెలిపారు.

సుంకాల తగ్గింపునకు పరిమితమైన ఒప్పందం కాదని పార్మెలిన్ అన్నారు. దీర్ఘకాలిక పెట్టుబడులు, ఉపాధి, ఆవిష్కరణలు, స్థిరమైన ఆర్థిక వృద్ధికి ఇది పునాది వేస్తుందని పేర్కొన్నారు. ఒప్పందం కింద జుఖీరూ దేశాలు భారత్‌లో 15 ఏళ్లలో 100 బిలియన్ డాలర్ల పెట్టుబడులను ప్రోత్సహించడంతో పాటు సుమారు 10 లక్షల ఉద్యోగాల కల్పనకు లక్ష్యంగా పెట్టుకున్నాయని వివరించారు. భారత్-ఈఎఫ్‌టీఏ ఒప్పందం భారత్-స్విట్జర్లాండ్ ఆర్థిక సంబంధాల్లో కీలక ముందడుగని ప్రధాని మోదీ అభివర్ణించారు. అక్టోబరు 5 నుంచి 7 వరకు భారత్‌లో పర్యటించనున్న పార్మెలిన్.. రాష్ట్రపతి, ప్రధానితో కీలక సమావేశాలు నిర్వహించనున్నారు.

# చట్టవిరుద్ధంగా, ఏకపక్షంగా మార్చారు

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికల సంఘం విడుదల చేసిన ప్రకటనను కూడా ఆయన పంచుకున్నారు.

**"రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం"**

సర్ ప్రక్రియలో ఓటర్ల పేర్ల తొలగింపు రాజ్యాంగం, ఎన్నికల ప్రక్రియ మౌలిక సూత్రాలకు విరుద్ధమని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా అన్నారు. ఎన్నికల ప్రక్రియలో అక్రమాలు జరిగాయనే విషయాన్ని ప్రజలు గుర్తించారని పేర్కొంటూ.. తమ నిరసన కొనసాగుతుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ కమ్యూనికేషన్స్ ఇన్‌ఛార్జి ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ సైతం సీఈసీపై తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రధాని మోదీకి భయపడే జెన్-జెడ్ ఓటర్లను తొలగించేందుకే ఫారం-6ను ఉద్దేశపూర్వకంగా మార్చారని ఆయన ఆరోపించారు. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆదేశాలతో రాజ్యాంగానికి ద్రోహం చేశారని విమర్శించారు.

**సీఈసీపై చర్యలు తీసుకోవాలి: సిసోడియా**

ఫారం-6లో మార్పులపై ఆప్ నేత మనీశ్ సిసోడియా ప్రశ్నలు లేవనెత్తారు. ఫారం-6ను మార్చేందుకు జ్ఞానేశ్ కుమార్ సుప్రీంకోర్టు అనుమతి పొందలేదని స్పష్టం అయిందన్నారు. ఈ వ్యవహారంలో అనేక ప్రశ్నలు తలెత్తుతున్నందున సీఈసీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఫారం-6 మార్పులు ఓటర్ల జాబితాలో కొత్త పేర్ల నమోదు ప్రక్రియపై ప్రభావం చూపే అవకాశం ఉందని ఆరోపించారు.

కొత్తగా ఓటర్ల జాబితాలో పేరు నమోదు చేసుకునేందుకు అర్హులైన వారు సమర్పించే ఫారం-6లో మార్పుల అంశంపై సుప్రీంకోర్టు సోమవారం కీలక వ్యాఖ్యలు చేసింది. ఫారం-6లో చేసిన సవరించిన మార్పులను తాము ఆమోదించలేదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. మార్పులు ఎవరు చేశారో తెలుసుకునేందుకు సంబంధిత రికార్డులను పరిశీలిస్తామని పేర్కొంది. సీఈసీ ఏకపక్షంగా పలు నిర్ణయాలు తీసుకున్నారంటూ దాఖలైన పిటిషన్లపై విచారణ చేపట్టిన ధర్మాసనం.. కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేసింది. చట్టానికి విరుద్ధంగా ఉన్నట్లు తేలిన నిర్ణయాలను రద్దు చేసే అంశాన్ని పరిశీలిస్తామని కోర్టు పేర్కొంది. సీఈసీకి ఉన్న చట్టపరమైన మినహాయింపుల పరిధినీ పరిశీలిస్తామని వెల్లడించింది. అయితే, విచారణ పూర్తయ్యే వరకు జ్ఞానేశ్ కుమార్‌ను నిర్ణయాలు తీసుకోకుండా నిరోధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు మాత్రం జారీ చేయలేదు. ఈ పరిణామాలతో ఫారం-6 మార్పులు, సర్ ప్రక్రియపై కాంగ్రెస్ సహా విపక్షాల విమర్శలు మరింత తీవ్రతరం అయ్యాయి. ఇదే సమయంలో ఎన్నికల సంఘం రాహుల్ గాంధీ ఆరోపణలను "భ్రామకమైనవి"గా పేర్కొంటూ స్పందించింది. సర్‌కు సంబంధించిన నిర్ణయం కమిషన్ ఏకగ్రీవ ఆమోదంతోనే తీసుకున్నామని ఈసీ వివరణ ఇచ్చింది.

# చట్టవిరుద్ధమైతే రద్దుచేస్తాం

**ఢిల్లీ:** కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) ఏకగ్రీవంగా గానీ, మెజార్టీ ప్రకారం గానీ నిర్ణయాలు తీసుకుని ఉండకపోతే వాటిని రద్దుచేస్తామని సుప్రీంకోర్టు ప్రకటించింది. అయితే ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్ మునుముందు ఎలాంటి నిర్ణయాలు తీసుకోకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడానికి మాత్రం నిరాకరించింది. ఇద్దరు ఎన్నికల కమిషనర్ల సమ్మతి లేకుండా ఈసీ అనేక నిర్ణయాలు తీసుకుంటోందని, దానిపై విచారణ జరిపి జ్ఞానేశ్‌ను నిలువరించే ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతూ పట్నాకు చెందిన రాకేశ్‌కుమార్ సింగ్, న్యాయవాది శైలేంద్ర మణి త్రిపాఠి సుప్రీంకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు వేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది. సీఈసీకి తన పదవీకాలం తర్వాత కూడా విచారణల నుంచి చట్టపరమైన రక్షణ ఉంటుందా అనే అంశాన్ని తాము పరిశీలించే అవకాశం ఉందని తెలిపింది. "కోర్టు అధికారాలు మీకు తెలుసు కదా. మేం అన్ని నిర్ణయాలను పరిశీలిస్తాం. చట్టప్రకారం లేనివాటిని రద్దు చేస్తాం. విచారణలను ఎదుర్కోవాల్సిన అవసరం లేకుండా సీఈసీకి ఉన్న రక్షణ.. న్యాయమూర్తులమైన మాకు కూడా లేదు" అని వ్యాఖ్యానించింది.

ఓటుహక్కు విషయంలో పౌరులంతా అభద్రతా భావంతో ఉన్నారని, దానివల్ల సీఈసీని సస్పెండ్ చేయాలని పిటిషనర్ రాకేశ్‌కుమార్ తరఫు న్యాయవాది వికాస్ సింగ్ కోరారు. '..అలాచేస్తే ఈసీ కార్యకలాపాలు స్తంభించిపోతాయి. ఎన్నికలను ఎవరు నిర్వహిస్తారు? రాజ్యాంగ నిర్దేశానుసారం ఈసీ పనిచేయాలి' అని ధర్మాసనం తేల్చిచెప్పింది. ఇద్దరు కమిషనర్లు ఆ విధులు నిర్వర్తించవచ్చని వికాస్‌సింగ్ వాదించారు. దీనిపై ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వాలన్నా సంబంధిత వర్గాల స్పందనను తెలుసుకోవాల్సి ఉందని న్యాయమూర్తులు చెప్పారు.

"ఈసీ విధులకు సంబంధించి చట్టం ఉంది. దాన్ని పాటిస్తారనే ఆశిస్తున్నాం. ఉల్లంఘన ఉంటే మేం సరిచేస్తాం. ఏకగ్రీవం, మెజారిటీ ప్రకారం లేని నిర్ణయాలను కోర్టు రద్దు చేయగలదు" అని తెలిపారు. కేవలం ఒక వార్తా కథనం ఆధారంగా సీఈసీపై ఉత్తర్వులు జారీ చేయలేమన్నారు. రెండు పిటిషన్లనూ కలిపి విచారణ కొనసాగిస్తామని ధర్మాసనం తెలిపింది. ఓటర్ల జాబితాలో పేరు చేర్చడానికి వినియోగించే ఫారం-6 నమూనాలో ఎలాంటి మార్పుల్ని తాము ఆమోదించలేదని ధర్మాసనం స్పష్టం చేసింది. రికార్డుల్ని తమకు సమర్పించినప్పుడు ఆ మార్పుల్ని ఎవరు చేశారో చూడాలనుకుంటున్నామని తెలిపింది. ధర్మాసనంలో జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీ, జస్టిస్ వి.మోహన ఉన్నారు.

**ఫారం-6ను మార్చలేదు**

కొత్త ఓటర్లుగా పేర్లు నమోదు చేసుకోవాలనుకునేవారు నింపాల్సిన ఫారం-6లో తాము ఎటువంటి మార్పులు చేయలేదని, బిహార్‌లో సర్ సందర్భంగా అదనంగా డిక్లరేషన్‌ను చేర్చామని, దానిని సుప్రీం కోర్టు గతంలో సమర్థించిందని ఎన్నికల సంఘం (ఈసీ) స్పష్టం చేసింది. ఫారం-6కు ఎలాంటి సవరణలనూ తాను ఆమోదించలేదని సోమవారం సుప్రీం కోర్టు స్పష్టం చేసిన నేపథ్యంలో ఈసీ ఈ వివరణ ఇచ్చింది. బిహార్‌లో సర్ సందర్భంగా 2025 జూన్ 24న ఇచ్చిన ఉత్తర్వుల్లో ఫారం-6కు తండ్రి, తాతల పేర్లను వెల్లడించాలన్న డిక్లరేషన్‌ను ఈసీ జత చేసింది. మే 27వ తేదీన సుప్రీం కోర్టు దానిని సమర్థించిందని సెప్టెంబరు 27వ తేదీన జారీ చేసిన ప్రకటనలో ఈసీ వెల్లడించింది. 'సర్ సమయంలో ఫారం-6కు జోడించిన డిక్లరేషన్‌ను గౌరవ సుప్రీం కోర్టు సమర్థించింది. సర్ లేని సమయంలో మాత్రం రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎలక్టర్స్ రూల్స్-1960 ప్రకారం ఫారం అందుబాటులో ఉంటుంది' అని ఆ ప్రకటనలో ఈసీ వివరించింది. ఇటీవల సర్‌పై వివాదం తలెత్తిన నేపథ్యంలో ఆన్‌లైన్ పోర్టళ్ల నుంచి డిక్లరేషన్‌ను ఈసీ ఉపసంహరించుకుంది. అయితే సర్‌లో లేని ప్రాంతాల్లోనే అది వర్తిస్తుందని ప్రకటించింది.

## వైద్యశాస్త్రంలో ముగ్గురికి నోబెల్

**స్టాక్‌హోమ్:** 2026 ఏడాది నోబెల్ పురస్కారాల ప్రకటన సోమవారం ప్రారంభమైంది. వైద్యశాస్త్రంలో విశేష కృషి చేసినందుకు కార్ల్ డిసెరోత్, పీటర్ హెగెమన్, జార్జ్ నగెల్‌లకు సంయుక్తంగా నోబెల్ పురస్కారం ప్రకటించారు. కాంతి నియంత్రిత అయాన్ ఛానల్స్, ఆప్టోజెనెటిక్స్ రంగాల్లో చేసిన కీలక ఆవిష్కరణలకు ఈ ముగ్గురిని ఎంపిక చేసినట్లు నోబెల్ కమిటీ వెల్లడించింది. ఆప్టోజెనెటిక్స్ ద్వారా కాంతిని ఉపయోగించి జీవకణాల్లోని కార్యకలాపాలను నియంత్రించడం, పరిశీలించడం సాధ్యమైంది. ఈ పరిశోధనలు నాడీశాస్త్రం సహా జీవ వైద్య రంగాల్లో పరిశోధనలకు కొత్త మార్గాలను తెరిచాయి. 2026 నోబెల్ పురస్కారాల ప్రకటన మంగళవారం భౌతికశాస్త్రంతో కొనసాగనుంది. బుధవారం రసాయనశాస్త్రం, గురువారం సాహిత్య విభాగాల్లో విజేతలను ప్రకటించనున్నారు. శుక్రవారం నోబెల్ శాంతి పురస్కారాన్ని వెల్లడిస్తారు. అక్టోబర్ 12న అర్థశాస్త్రంలో నోబెల్ పురస్కార విజేతను ప్రకటించనున్నారు. ఈ ఏడాది ఒక్కో నోబెల్ పురస్కారానికి నగదు బహుమతి 12 లక్షల డాలర్లు (సుమారు రూ.11.5 కోట్లు)గా ఉంది. స్వీడన్‌కు చెందిన శాస్త్రవేత్త, పారిశ్రామికవేత్త ఆల్ఫ్రెడ్ నోబెల్ జ్ఞాపకార్థం 1901 నుంచి నోబెల్ పురస్కారాలను ప్రదానం చేస్తున్నారు. నోబెల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వీడన్, నార్వేలకు చెందిన స్వతంత్ర సంస్థలు వివిధ విభాగాల్లో విశేష కృషి చేసిన వారిని ఎంపిక చేస్తాయి. భౌతికశాస్త్రం, రసాయనశాస్త్రం, వైద్యశాస్త్రం, సాహిత్యం, శాంతి, అర్థశాస్త్రం విభాగాల్లో ఏటా ఈ పురస్కారాలను అందజేస్తారు.

# మూడు డిమాండ్లపై రాజీపడే ప్రసక్తే లేదు

**న్యూఢిల్లీ:** ఎన్నికల వ్యవస్థకు సంబంధించి మూడు ప్రధాన డిమాండ్లపై వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పష్టం చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని, ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను రద్దు చేయాలని, ఈవీఎంలకు బదులుగా బ్యాలెట్ పేపర్‌తో ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఇవి కాంగ్రెస్ పార్టీ రాజీలేని డిమాండ్లని పేర్కొన్నారు. సోమవారం ఎక్స్‌లో ఖర్గే ఈ మూడు అంశాలను మరోసారి ప్రస్తావించారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ కార్యకర్తలు, 'ఇండియా' కూటమి భాగస్వామ్య పార్టీలు ఈ డిమాండ్లపై ఆందోళనలు నిర్వహిస్తున్నాయని తెలిపారు. ఎన్నికల వ్యవస్థలో మార్పుల కోసం పోరాడుతున్న పౌర సమాజ ప్రతినిధులు, యువజన సంఘాలకు కూడా కాంగ్రెస్ మద్దతుగా నిలుస్తుందని వెల్లడించారు.

**మూడు డిమాండ్లపై స్పష్టత**

సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి.
ఓటర్ల జాబితాల ఎస్ఐఆర్‌ను రద్దు చేయాలి.
ఈవీఎంలకు బదులుగా బ్యాలెట్ పేపర్‌తో ఎన్నికలు నిర్వహించాలి.

ఈ మూడు అంశాలపై దేశవ్యాప్తంగా తమ పార్టీ, 'ఇండియా' కూటమి భాగస్వామ్యాలు ఉద్యమిస్తున్నాయని ఖర్గే పేర్కొన్నారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియపై కొంతకాలంగా రాజకీయ వివాదం కొనసాగుతోంది. ప్రతిపక్ష పార్టీలు ఓటర్ల పేర్ల తొలగింపు, జాబితాల పరిశీలన, సంబంధిత వివరాలపై ఎన్నికల సంఘాన్ని ప్రశ్నిస్తున్నాయి. ఇటీవల ఎస్ఐఆర్‌కు సంబంధించిన కొన్ని నిర్ణయాలు, ఫైళ్ల విషయంలో ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి అభ్యంతరాలు వ్యక్తం చేశారంటూ వచ్చిన కథనాలు కూడా చర్చకు దారితీశాయి.

అయితే ఈ అంశంపై ఎన్నికల సంఘం వివరణ ఇచ్చింది. నిర్ణయాలు తీసుకునే సమయంలో భిన్న అభిప్రాయాలు, సూచనలు వ్యక్తం కావడం సహజమేనని తెలిపింది. అధికారుల మధ్య జరిగిన చర్చలను సంస్థాగత విభేదాలుగా చూడకూడదని స్పష్టం చేసింది. ఎస్ఐఆర్ షెడ్యూల్‌కు సంబంధించిన నిర్ణయాలు ఏకగ్రీవంగానే తీసుకున్నామని పేర్కొంది. ఎన్నికల వ్యవస్థకు సంబంధించిన అంశాలపై 'ఇండియా' కూటమి ఇప్పటికే ఉమ్మడి కార్యాచరణ ప్రకటించింది. సెప్టెంబరు 30న న్యూదిల్లీలో జరిగిన కూటమి సమన్వయ సమావేశం అనంతరం ఖర్గే మూడు ప్రధాన డిమాండ్లను వెల్లడించారు. అక్టోబరు 2 నుంచి 8 వరకు జిల్లా స్థాయిలో 'సేవ్ డెమోక్రసీ మార్చ్' నిర్వహించాలని నిర్ణయించారు. అక్టోబరు 6న ప్రతిపక్ష ఎంపీలు ఎన్నికల సంఘం కార్యాలయం వైపు మార్చ్ నిర్వహించనున్నారు. అక్టోబరు రెండో వారంలో ప్రతిపక్ష నేతలు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును కలిసి ఎన్నికల వ్యవస్థకు సంబంధించిన అంశాలను వివరించనున్నట్లు ఖర్గే గతంలో తెలిపారు.

తొలివెలుగు
TGTEL/26/A6221
యాదాద్రి భువనగిరి మంగళవారం 06 అక్టోబర్ 2026




# బంగారంపై సులభంగా రుణాలు

- రామన్నపేటలో 'బజాజ్ గోల్డ్ లోన్' కేంద్రం ప్రారంభం
- ప్రారంభించిన ఉపసర్పంచ్ మోటె రమేష్
- ప్రజలకు సులభతరమైన రుణాలు అందించడమే లక్ష్యం

**తొలివెలుగు, రామన్నపేట :** రామన్నపేట మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన 'బజాజ్ గోల్డ్ లోన్' కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉపసర్పంచ్ మోటె రమేష్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ.. స్థానిక ప్రజలకు సులభతరమైన విధానంలో బంగారంపై రుణ సేవలు అందించాలనే ఉద్దేశంతో రామన్నపేటలో కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అత్యవసర ఆర్థిక అవసరాల సమయంలో ప్రజలకు ఈ సేవలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏరియా మేనేజర్ పెండం రాము, బ్రాంచ్ మేనేజర్ జె. సాయికుమార్, సిబ్బంది నాగరాజుతో పాటు రామన్నపేట నాయకులు జామీరుద్దీన్, కందుల హనుమంత, వార్డు సభ్యులు గొరిగె మహేష్, కొమ్ము శేఖర్, కృష్ణ, అమీర్, శ్రీను, శశి తదితరులు పాల్గొన్నారు.

# వినియోగదారుల ఆదరణే వ్యాపారానికి మూలం

- హయత్‌నగర్‌లో 'చెన్నాపట్నం ఫిల్టర్ కాఫీ' ప్రారంభం
- ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి



**తొలివెలుగు, హయత్‌నగర్ :** హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన 'చెన్నాపట్నం ఫిల్టర్ కాఫీ' కేంద్రాన్ని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. హయత్‌నగర్ ప్రాంత ప్రజలకు నాణ్యమైన ఫిల్టర్ కాఫీతో పాటు రుచికరమైన అల్పాహారాన్ని అందిస్తూ వినియోగదారుల ఆదరణ పొందాలని ఆకాంక్షించారు. వ్యాపార రంగంలో నాణ్యత, సేవా భావం ముఖ్యమని పేర్కొన్నారు. సంస్థ నిర్వాహకుడు సతీష్ రెడ్డి మాట్లాడుతూ వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా నాణ్యమైన ఫిల్టర్ కాఫీతో పాటు రుచికరమైన ఆహార పదార్థాలను అందించడమే తమ ప్రధాన లక్ష్యమన్నారు. ప్రజల ప్రోత్సాహంతో సంస్థను మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, సిబ్బంది, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# పార్టీకి గ్రామ కమిటీలే మూలస్తంభాలు

- శోభనాద్రిపురం కాంగ్రెస్ నూతన కమిటీ ఎన్నిక
- గ్రామ శాఖ అధ్యక్షుడిగా ఏటెల్లి పరమేష్

**తొలివెలుగు, రామన్నపేట :** గ్రామ స్థాయి కమిటీలే కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రధాన పునాదులని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పున్న జగన్మోహన్ అన్నారు. రామన్నపేట మండలం శోభనాద్రిపురం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నూతన గ్రామ శాఖ కమిటీ ఎన్నికల కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పున్న జగన్మోహన్ మాట్లాడుతూ.. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్‌లు వేముల వీరేశం, బీర్ల ఐలయ్య నాయకత్వంలో గ్రామ కమిటీల ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామ శాఖ అధ్యక్షుడిగా ఏటెల్లి పరమేష్, ఉపాధ్యక్షులుగా దేశోజు బిక్షమాచారి, తాడూరి సైదులు, ప్రధాన కార్యదర్శిగా ముక్కామల సతీష్, కార్యదర్శులుగా బొడిగె కిరణ్ కుమార్, నల్లబోలు లింగయ్య, కోశాధికారిగా జక్కుల మహేష్ ఎంపికయ్యారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ సిరిగిరెడ్డి మల్లారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నంద్యాల భిక్షంరెడ్డి, నాయకులు పూస బాలకిషన్, శంబాల వెంకన్న, ఎండీ అక్రమ్, గుత్త నర్సిరెడ్డి, సర్పంచ్ కంచి మధుసూదన్, మాజీ సర్పంచులు అండాలు యాదయ్య, బొడిగె చంద్రకళ, శ్రీనివాస్ గౌడ్, సీనియర్ నాయకులు కొండకింది శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ఉద్యోగులపై నిర్లక్ష్యం తగదు





- 51 శాతం పీఆర్‌సీ ఇవ్వాలి, సీపీఎస్ రద్దు చేయాలి
- రాజపేటలో పీఆర్‌టీయూ కార్యాలయం ప్రారంభం

**తొలివెలుగు, రాజపేట :** రాజపేట మండల కేంద్రంలో సోమవారం పీఆర్‌టీయూ టీఎస్ మండల శాఖ నూతన కార్యాలయాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి పీఆర్‌టీయూ టీఎస్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు గడసంతల మధుసూదన్, జిల్లా ప్రధాన కార్యదర్శి కంచరకుంట్ల వీరారెడ్డి, రాజపేట మండల విద్యాధికారి (ఎంఈఓ) కె. మనోజ్ కుమార్, కాంప్లెక్స్ హెచ్ఎం తడక రాజు ముఖ్య అతిథులుగా హాజరై కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మధుసూదన్ మాట్లాడుతూ.. ఉద్యోగులు, ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి వీడాలని డిమాండ్ చేశారు. వెంటనే 51 శాతం పీఆర్‌సీ ప్రకటించాలని, సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) పునరుద్ధరించాలని కోరారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల బిల్లులను తక్షణమే క్లియర్ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు జెల్ల ప్రభాకర్, కిరణ్, ఇప్ప సంజీవులు, జక్కుల ప్రభాకర్, మాశెట్టి శ్రీనివాసులు, శ్యాంసుందర్, అరుణ, శిరీష, భారతి, రాజరాజేశ్వరి, మాధవిలత, శివరాజు, కొండల్ రెడ్డి, నరేష్, గౌస్ పాషా, రవీందర్, బాలరాజు, రాంప్రసాద్, గోపాలకృష్ణ, సోమిరెడ్డి, ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, కార్యక్రమ నిర్వహణను పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు గౌటె బాలరాజు, ప్రధాన కార్యదర్శి సంపతి సుబ్బరాజు పర్యవేక్షించారు.

# ఆపదలో ఉన్నవారికి ఆపన్నహస్తం

- లయన్స్ క్లబ్ సేవలు మరింత విస్తరించాలి: డిస్ట్రిక్ట్ గవర్నర్ కె.వి. ప్రసాద్
- వైభవంగా చిట్యాల నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

**తొలివెలుగు, చిట్యాల :** ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలో లయన్స్ క్లబ్ ఎల్లప్పుడూ ముందుంటుందని, సేవా కార్యక్రమాలను మరింత విస్తరించాలని డిస్ట్రిక్ట్ గవర్నర్ కె.వి. ప్రసాద్ కోరారు. చిట్యాల లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా లయన్స్ క్లబ్ అనేక దేశాల్లో సేవా కార్యక్రమాలు అందిస్తోందని తెలిపారు. చిట్యాల లయన్స్ క్లబ్ ప్రతినిధులు సేవా రంగంలో జిల్లాలోనే ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ చిట్యాల అధ్యక్షుడిగా రేగులగడ్డ నరసింహ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా పాటి మాధవరెడ్డి, కోశాధికారిగా పంతంగి కరుణాకర్ గౌడ్ ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా మాజీ గవర్నర్లు రేపాల మదన్ మోహన్, తీగల మోహన్ రావు, క్లబ్ సభ్యులు జనగాం రవీందర్ గౌడ్, పందిరి శ్రీనివాసులు, కోమటిరెడ్డి నరసింహారెడ్డి, తేరేటిపల్లి హనుమంతు తదితరులు పాల్గొన్నారు.






# 'ఉత్తటూరు' కాంగ్రెస్ అధ్యక్షుడిగా లింగయ్య యాదవ్

- ఏకగ్రీవంగా నూతన గ్రామ శాఖ కమిటీ ఎన్నిక
- పార్టీ బలోపేతానికి కార్యకర్తలతో కలిసి కృషి: లింగయ్య యాదవ్

**తొలివెలుగు, రామన్నపేట :** రామన్నపేట మండలం ఉత్తటూరు గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నూతన గ్రామ శాఖ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సర్పంచ్, సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షుడు కోళ్ల రామకృష్ణ అధ్యక్షతన సోమవారం ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు. గ్రామ శాఖ అధ్యక్షుడిగా దాసరి లింగయ్య యాదవ్, ఉపాధ్యక్షురాలిగా చెరుకు వసంత, ప్రధాన కార్యదర్శిగా కోళ్ల ధణేష్, కోశాధికారిగా పోగుల గోపాల్, సహాయ కార్యదర్శిగా గర్ష అశోక్, సహాయ కోశాధికారిగా ఉప్పునూతల మల్లేష్, సాంస్కృతిక కార్యదర్శిగా భైరబోయిన రాఘవేంద్ర ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు దాసరి లింగయ్య యాదవ్ మాట్లాడుతూ. తన ఎన్నికకు సహకరించిన నకిరేకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ వేముల వీరేశంకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ పనిచేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పున్న జగన్మోహన్, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ సిరిగిరెడ్డి మల్లారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ నంద్యాల భిక్షంరెడ్డి, నాయకులు కర్నాటి లింగస్వామి, శంబాల వెంకన్న, ఎండీ అక్రమ్, జెట్టి బాలమల్లయ్య, జెట్టి కృష్ణ, మేడి చంద్రయ్య, జంగిలి మల్లేష్, పోతుల మత్స్యగిరి తదితరులు పాల్గొన్నారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ సర్పంచ్ కోళ్ల రామకృష్ణ ధన్యవాదాలు తెలిపారు.



# నీరు వృథా.. చెరువు శిఖం కబ్జా!

- వెంకట్రామయ్య చెరువు అలుగును పునరుద్ధరించాలని రైతుల డిమాండ్
- ఎంపీడీవో రాములుకు వినతిపత్రం.. కబ్జాలను అరికట్టి చెరువు భూములను కాపాడాలని విజ్ఞప్తి

**తొలివెలుగు, రామన్నపేట :** రామన్నపేట మండల కేంద్రంలోని వెంకట్రామయ్య చెరువు అలుగును తక్షణమే పునరుద్ధరించి చెరువు నీటిని సంరక్షించాలని కోరుతూ స్థానిక రైతులు సోమవారం గ్రీవెన్స్ డే సందర్భంగా ఎంపీడీవో రాములుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ కందుల హనుమంతు మాట్లాడుతూ.. చెరువు అలుగు దెబ్బతినడంతో నీరు వృథాగా బయటకు వెళ్లిపోతోందని తెలిపారు. దీంతో చెరువులో నీటిమట్టం క్రమంగా తగ్గుతోందని పేర్కొన్నారు. నీటిమట్టం తగ్గడంతో చెరువు శిఖం ప్రాంతం అక్రమ కబ్జాలకు గురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు తక్షణమే స్పందించి చెరువు అలుగును పునరుద్ధరించాలని రైతులు కోరారు. అలాగే చెరువు చుట్టూ హద్దురాళ్లు ఏర్పాటు చేసి, ఫెన్సింగ్ నిర్మించడం ద్వారా చెరువు భూములను పరిరక్షించాలని విజ్ఞప్తి చేశారు. చెరువు నీటిని వృథా కాకుండా అడ్డుకోవడంతో పాటు భవిష్యత్‌లో కబ్జాలకు అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎజాజ్, యాటా ఇస్తారి, బచ్చా రాములు, కందుల వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచ్ భర్త 'షాడో' పాలనను అరికట్టాలి

- గ్రామ పాలనలో జోక్యాన్ని అరికట్టాలి.. కలెక్టర్‌కు అఖిలపక్ష నాయకుల వినతి
- అల్లందేవిచెరువులో సర్పంచ్ భర్త తీరుపై గ్రామస్థుల ఆగ్రహం






**తొలివెలుగు, సంస్థాన్ నారాయణపురం :** గ్రామ పంచాయతీ పాలనలో మహిళా సర్పంచ్ భర్త జోక్యాన్ని అరికట్టాలని డిమాండ్ చేస్తూ అల్లందేవిచెరువు గ్రామస్థులు, అఖిలపక్ష నాయకులు ఆందోళన చేపట్టారు. సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్‌ను కలిసి తమ సమస్యలను వివరిస్తూ వినతిపత్రం అందజేశారు. గ్రామ పంచాయతీ పరిపాలనలో సర్పంచ్ భర్త పెత్తనం కొనసాగుతోందని, ఆయన జోక్యంతో గ్రామస్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు ఆరోపించారు.

**గ్రామ పాలనలో జోక్యం ఆపాలి:**

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ప్రజలచే ఎన్నికైన సర్పంచ్ ద్వారా జరగాల్సిన గ్రామ పాలనలో ఆమె భర్త అనవసరంగా జోక్యం చేసుకుంటున్నారని ఆరోపించారు. పంచాయతీ వ్యవహారాల్లో ఆయన పెత్తనం చెలాయిస్తున్నారని, ప్రజలపై దౌర్జన్యపూరితంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. మహిళా సర్పంచ్ పదవిని అడ్డం పెట్టుకుని భర్త పాలన సాగించడాన్ని అరికట్టాలని డిమాండ్ చేశారు.

**గ్రామసభలోనూ అభ్యంతరాలు:**

అక్టోబర్ 2న నిర్వహించిన గ్రామసభలోనూ సర్పంచ్ భర్త వ్యవహారశైలిపై గ్రామస్థులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారని నాయకులు తెలిపారు. గ్రామ పాలనకు సంబంధించిన అంశాల్లో ఆయన జోక్యం చేసుకోవడంపై గ్రామస్థులు ప్రశ్నించారని పేర్కొన్నారు. ప్రజల అభిప్రాయాలను, గ్రామసభ నిర్ణయాలను గౌరవిస్తూ పంచాయతీ పరిపాలన పారదర్శకంగా కొనసాగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

**చర్యలు తీసుకునే వరకు పోరాటం:**

సర్పంచ్ భర్త జోక్యాన్ని అరికట్టి గ్రామ పంచాయతీ పరిపాలన సక్రమంగా జరిగేలా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని అఖిలపక్ష నాయకులు, గ్రామస్థులు కలెక్టర్‌ను కోరారు. సమస్యపై అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకునే వరకు తమ పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. గ్రామంలో ప్రశాంత వాతావరణం నెలకొనేలా అధికారులు వెంటనే జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకుడు సుర్వి నరసింహ గౌడ్, ధర్మ సమాజ్ పార్టీ జిల్లా కార్యదర్శి ఏర్పుల సురేష్ మహారాజ్, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు ఏర్పుల రాజేష్, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బాత్క శేఖర్ యాదవ్, సీపీఎం మండల నాయకుడు గుండు జంగయ్య, సుర్వి శేఖర్ గౌడ్, లింగస్వామి, గుండు లింగన్న గౌడ్, గంగాదేవి భిక్షపతి, గుండు రాజు, హనుమంతు వెంకటేష్, బాత్క రమేష్ తదితరులు పాల్గొన్నారు.

TGTEL/26/A6221
తొలివెలుగు
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం. జాతీయపత్రిక
TOLE VELUGGU JATIYAPATRIKA
యాదాద్రి భువనగిరి మంగళవారం 06 అక్టోబర్ 2026



# మురుగుకూపంగా మండల కేంద్రం!

- రోడ్డుపై ప్రవహిస్తున్న డ్రైనేజీ నీరు.. ఆరు నెలలుగా తీయని పూడిక
- దుర్వాసన, పారిశుద్ధ్య సమస్యలతో ప్రజల అవస్థలు
- అధికారులు, ప్రజాప్రతినిధుల ఉదాసీనతపై ప్రజల ఆగ్రహం





**తొలివెలుగు, కృష్ణ :** మండల కేంద్రం కృష్ణలో పారిశుద్ధ్య పరిస్థితులు అధ్వానంగా మారుతున్నాయి. గ్రామంలోని మురుగుకాల్వల్లో పేరుకుపోయిన పూడికను నెలల తరబడి తొలగించకపోవడంతో డ్రైనేజీ నీరు రోడ్లపైకి ప్రవహిస్తోంది. దీంతో ప్రధాన రహదారిపై మురుగునీరు నిలిచిపోవడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇళ్ల పరిసరాల్లో మురుగునీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతుండటంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**ఆరు నెలలుగా ఇదే పరిస్థితి:**

స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామంలోని పలు మురుగు కాల్వల్లో సుమారు ఆరు నెలలుగా పూడిక తీయలేదు. కాల్వల్లో చెత్త, మట్టి పేరుకుపోవడంతో మురుగునీరు సాఫీగా వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. వర్షాలు కురిసిన సమయంలో పరిస్థితి మరింత దారుణంగా మారుతోందని స్థానికులు చెబుతున్నారు. మురుగునీరు రోడ్డుపైకి చేరడంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని వాపోతున్నారు.

**దుర్వాసనతో అవస్థలు:**

రోడ్డుపై, ఇళ్ల సమీపంలో మురుగునీరు నిలిచిపోవడంతో తీవ్ర దుర్వాసన వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో దుర్వాసన భరించలేని స్థాయిలో ఉంటోందని చెబుతున్నారు. దోమలు పెరుగుతుండటంతో ప్రజలు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పారిశుద్ధ్యంపై అధికారులు తగిన శ్రద్ధ చూపకపోవడంతో సమస్య రోజురోజుకూ తీవ్రమవుతోందని పేర్కొంటున్నారు.

**అధికారుల కళ్ల ముందే సమస్య:**

మండల కేంద్రంలోనే రోడ్లపై మురుగునీరు ప్రవహిస్తున్నప్పటికీ పంచాయతీ అధికారులు స్పందించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని పలుమార్లు కోరినా పరిస్థితిలో మార్పు కనిపించలేదని చెబుతున్నారు. అధికారుల కళ్ల ముందే సమస్య ఉన్నప్పటికీ పట్టించుకోకపోవడం పట్ల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

**మండల కేంద్రానికే ఈ పరిస్థితా?**

మండల కేంద్రంలోనే పారిశుద్ధ్య పరిస్థితులు ఇలా ఉంటే చుట్టుపక్కల గ్రామాల్లో పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చని స్థానికులు అంటున్నారు. మండల కేంద్రం కావడంతో నిత్యం వివిధ పనుల నిమిత్తం ప్రజలు పెద్ద సంఖ్యలో ఇక్కడికి వస్తుంటారని, ఇలాంటి పరిస్థితులతో వారికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెబుతున్నారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

**తక్షణమే కాల్వలను శుభ్రం చేయాలి:**

పంచాయతీ అధికారులు వెంటనే స్పందించి మురుగు కాల్వల్లో పేరుకుపోయిన పూడికను తొలగించాలని, రోడ్లపైకి మురుగునీరు రాకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. కాల్వలను క్రమం తప్పకుండా శుభ్రం చేయడంతో పాటు దోమల నివారణకు పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు ఇకనైనా నిర్లక్ష్యం చేయకుండా సమస్యను పరిష్కరించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



# రైలు ప్రమాద బాధితుడికి రూ.50 వేల ఆర్థిక సాయం

- గొర్రెల కాపరి కృష్ణయ్యకు 'బీర్ల ఫౌండేషన్' అండ
- సాయం అందజేసిన ఫౌండేషన్ చైర్మన్ బీర్ల అనిత

**తొలివెలుగు, భూదాన్‌పోచంపల్లి :** రైలు ప్రమాదంలో సుమారు 400 గొర్రెలను కోల్పోయి తీవ్రంగా నష్టపోయిన జూలూరు గ్రామానికి చెందిన గొర్రెల కాపరి బాలముని కృష్ణయ్య యాదవ్‌కు 'బీర్ల ఫౌండేషన్' ఆర్థిక సాయం అందించింది. సోమవారం ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.50 వేల ఆర్థిక సాయాన్ని చైర్మన్ బీర్ల అనిత బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా బీర్ల అనిత మాట్లాడుతూ.. రైలు ప్రమాదంలో గొర్రెలను కోల్పోయి తీవ్రంగా నష్టపోయిన కృష్ణయ్య కుటుంబానికి అండగా నిలిచేందుకు ఆర్థిక సాయం అందించినట్లు తెలిపారు. బాధితుడికి ప్రభుత్వం నుంచి కూడా తగిన పరిహారం, సహకారం అందేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పోచంపల్లి పీఏసీఎస్ చైర్మన్ పాక మల్లేష్ యాదవ్, యాదవ సంఘం నాయకులు గుండబోయిన అయోధ్య, మాజీ వైస్ ఎంపీపీ పాక వెంకటేష్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఉప్పునూతల వెంకటేష్ యాదవ్, యాదవ సంఘం నాయకుడు పాక జంగయ్య యాదవ్, సోమ రమేష్ కురుమ, కొత్తపల్లి జంగయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



# సీసీ రోడ్లతో మారనున్న పరమేశ్వర కాలనీ రూపురేఖలు

- రూ.58 లక్షలతో రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం
- కాలనీ అభివృద్ధికి ప్రాధాన్యం: సుంకరి వెంకన్న గౌడ్

**తొలివెలుగు, హయత్‌నగర్ :** పరమేశ్వర కాలనీలో మౌలిక వసతుల అభివృద్ధికి మరో ముందడుగు పడింది. రూ.58 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం శంకుస్థాపన చేశారు. సంఘం అధ్యక్షుడు సుంకరి వెంకన్న గౌడ్, వ్యవస్థాపక అధ్యక్షుడు ముద్దం పరమేష్ గౌడ్, ఇతర ప్రతినిధులు పూజా కార్యక్రమాలు నిర్వహించి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సుంకరి వెంకన్న గౌడ్ మాట్లాడుతూ.. కాలనీ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా సంక్షేమ సంఘం పనిచేస్తోందన్నారు. సీసీ రోడ్ల నిర్మాణంతో కాలనీవాసుల రాకపోకలకు ఇబ్బందులు తొలగడంతో పాటు రహదారుల సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. అభివృద్ధి పనులను నాణ్యతతో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు కాటేపల్లి ముత్యాలు గౌడ్, ప్రధాన కార్యదర్శి అక్కి రమేష్, జాయింట్ సెక్రటరీ ఆలకుంట్ల శ్రీధర్, కోశాధికారి రాపోలు జ్ఞానేశ్వర్, గౌరవ సలహాదారులు కర్నాటి శ్రీనివాస్ రెడ్డి, సన్నాయిల ప్రసాద్ కుమార్, కంకణాల మల్లారెడ్డి, పజ్జూరు మోహన్ రెడ్డి, కందాల చంద్రారెడ్డి, కమిటీ సభ్యులు సోడాదాసు జానేష్, కుంచాల ఏడుకొండలు, తాళ్ల శంకర్ గౌడ్, అనంతోజుల శ్రీనివాస చారి, గుర్రం శ్రీనివాస్, ఖాదీ బోర్డు అధ్యక్షుడు మన్నెం శ్రీనివాస్ యాదవ్, బ్లడ్ బ్యాంక్ అధ్యక్షుడు బానోతు భాగ్య నాయక్, పల్లెపు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్‌తో బాధితులకు ఊరట

- ముగ్గురికి రూ.1.48 లక్షల చెక్కుల పంపిణీ
- సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: దేవరాయకుమార్, వంగూరు పాండు

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి :** ఆపదలో ఉన్న వారికి ముఖ్యమంత్రి సహాయనిధి ఆర్థిక చేయూతనిస్తోందని ఎనిమిదో వార్డు కౌన్సిలర్ దేవరాయకుమార్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు వంగూరు పాండు అన్నారు. పురపాలక పరిధిలోని సీతావారిగూడెంకు చెందిన ముగ్గురికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను సోమవారం వారు పంపిణీ చేశారు. రామసాని మల్లారెడ్డికి రూ.49 వేలు, ఒంటెద్దు సత్తయ్యకు రూ.59 వేలు, కొమురెల్లి కిష్టయ్యకు రూ.40 వేల చొప్పున ఆర్థిక సాయం మంజూరైంది. ఈ సందర్భంగా కౌన్సిలర్ దేవరాయకుమార్, వంగూరు పాండు మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందన్నారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న బాధితులకు సీఎంఆర్ఎఫ్ ద్వారా ప్రభుత్వం అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ సామల రాజిరెడ్డి, సామల సుధాకర్‌రెడ్డి, చింతకుంట్ల శేఖర్‌రెడ్డి, ధోటి భాస్కర్, గంగాదేవి మహేష్, కన్నె ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.





# నమ్మకానికి చిరునామా.. 'శ్రీ తారక జువెలర్స్'

- హయత్‌నగర్‌లో మూడో శాఖ ప్రారంభం
- ప్రారంభోత్సవ సందర్భంగా ప్రత్యేక ఆఫర్లు ప్రకటించిన యాజమాన్యం

**తొలివెలుగు, హయత్‌నగర్ :** హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ సమీపంలో కొల్లోజు సత్యనారాయణ అండ్ సన్స్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన 'శ్రీ తారక జువెలర్స్' మూడో శాఖను సోమవారం ఘనంగా ప్రారంభించారు. కుటుంబ సభ్యులతో కలిసి నిర్వాహకులు ప్రత్యేక పూజలు నిర్వహించి షోరూమ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. 1967లో నల్గొండలో ప్రారంభమైన తమ సంస్థ 59 ఏళ్లుగా వినియోగదారుల ఆదరాభిమానాలను పొందుతూ కొనసాగుతోందన్నారు. కొత్తపేట శాఖ కూడా 16 ఏళ్లుగా నాణ్యత, నమ్మకానికి ప్రాధాన్యమిస్తూ వినియోగదారుల ఆదరణ పొందుతోందని తెలిపారు. వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా సేవలను మరింత విస్తరించాలనే ఉద్దేశంతో హయత్‌నగర్‌లో మూడో శాఖను ప్రారంభించినట్లు పేర్కొన్నారు. ప్రారంభోత్సవం సందర్భంగా ప్రత్యేక ఆఫర్లను అందుబాటులోకి తెచ్చినట్లు యాజమాన్యం తెలిపింది. 91.6 స్వచ్ఛత కలిగిన బంగారు ఆభరణాలపై ప్రతి 10 గ్రాములకు రూ.5,000 వరకు తగ్గింపు, డైమండ్ ఆభరణాలపై 5 శాతం తగ్గింపు అందిస్తున్నట్లు వెల్లడించింది. అలాగే వెండి వస్తువులపై ఎలాంటి తయారీ ఛార్జీలు వసూలు చేయడం లేదని తెలిపింది. ఈ ప్రత్యేక ఆఫర్లు ఎనిమిది రోజుల పాటు అందుబాటులో ఉంటాయని, స్థానిక ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని యాజమాన్యం కోరింది. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బంధువులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

# 23 కాలనీలకు దప్పిక తీర్చేలా చర్యలు చేపట్టాలి

- రాక్‌టౌన్ ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంక్ పనులు వేగవంతం చేయాలి
- ప్రజావాణిలో జోనల్ కమిషనర్ కార్యాలయ అధికారికి జేఏసీ వినతి



**తొలివెలుగు, హయత్‌నగర్ :** జీఎస్‌ఐ డివిజన్ జేఏసీ పరిధిలోని 23 కాలనీలలో నెలకొన్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని జేఏసీ ప్రతినిధులు కోరారు. ఎల్‌బీనగర్ జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జోనల్ కమిషనర్ కార్యాలయ అధికారి సీపీ శ్రీనివాస్‌ను కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ ప్రతినిధులు మాట్లాడుతూ.. రాక్‌టౌన్ ప్రాంతంలో ప్రతిపాదించిన ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులను త్వరితగతిన ప్రారంభించేలా జలమండలి అధికారులతో సమన్వయం చేయాలని కోరారు. గతంలో సమర్పించిన వినతిపత్రాలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి, కాలనీవాసులు ఎదుర్కొంటున్న తాగునీటి ఇబ్బందులను వివరించారు. రాక్‌టౌన్‌లో ప్రతిపాదించిన వాటర్ ట్యాంక్ నిర్మాణం పూర్తయితే జీఎస్‌ఐ డివిజన్ పరిధిలోని 23 కాలనీలకు మెరుగైన తాగునీటి సరఫరా అందే అవకాశం ఉంటుందని తెలిపారు. సమస్య తీవ్రతను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జీఎస్‌ఐ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు ఎర్ర వినోద్ రెడ్డి, నాయకులు బద్దం భాస్కర్ రెడ్డి, దయాకర్ రెడ్డి, మల్లేశం, సత్తి రెడ్డి, ఉమేష్ గౌడ్, రవీందర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, రాము, రామ్మోహన్, పున్న భాస్కర్, సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# విజేత యూత్ క్లబ్ అధ్యక్షుడిగా గుడ్డేటి పాండు

- రెండోసారి ఏకగ్రీవ ఎన్నిక
- భూదాన్ పోచంపల్లిలో నూతన కార్యవర్గం ఎంపిక



**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి :** భూదాన్ పోచంపల్లి పురపాలక కేంద్రంలో విజేత యూత్ క్లబ్ సర్వసభ్య సమావేశాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశంలో క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూత్ క్లబ్ అధ్యక్షుడిగా గుడ్డేటి పాండు రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా వనం దాస్ బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా దోర్నాల సదానందం, కోశాధికారిగా భోగా నాగరాజ్, సహాయ కార్యదర్శిగా దునక శ్రీకాంత్, క్రీడల కార్యదర్శిగా సీత నరేష్, సాంస్కృతిక కార్యదర్శిగా చెరుపల్లి పాండు ఎంపికయ్యారు. అలాగే కార్యవర్గ సభ్యులుగా శేఖర్, సీతా జగదీశ్వర్, ఈపూరి వెంకటేష్, దోర్నాల శ్రీనివాస్ తదితరులు ఎన్నికయ్యారు. యువజన సంక్షేమం, సామాజిక సేవా కార్యక్రమాల్లో క్లబ్ తరపున చురుగ్గా పాల్గొంటామని ఈ సందర్భంగా నూతన కార్యవర్గ ప్రతినిధులు తెలిపారు.




# త్రోబాల్‌లో గ్రీన్ గ్రోవ్ విద్యార్థుల సత్తా

- జాతీయ స్థాయి పోటీలకు కొత్తపల్లి సహస్ర, షేక్ సోను సోహెల్ ఎంపిక
- హర్షం వ్యక్తం చేసిన పాఠశాల యాజమాన్యం

**తొలివెలుగు, చిట్యాల :** చిట్యాలలోని గ్రీన్ గ్రోవ్ పాఠశాల విద్యార్థులు త్రోబాల్ పోటీల్లో సత్తా చాటారు. ఈ నెల 4న మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీల్లో పాఠశాలకు చెందిన కొత్తపల్లి సహస్ర, షేక్ సోను సోహెల్ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. సబ్‌జూనియర్ విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు పాఠశాల వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా జాతీయ స్థాయికి ఎంపికైన సహస్ర, సోను సోహెల్‌లను పాఠశాల డైరెక్టర్ జూలకంటి వేణుగోపాల్ రెడ్డి, ప్రిన్సిపల్ పోలా గోవర్ధన్, వ్యాయామ ఉపాధ్యాయుడు గంగాపురం రాము, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు. జాతీయ స్థాయి పోటీల్లోనూ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలతో పాటు చిట్యాల ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థుల ప్రతిభకు పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

# బెల్ట్ షాపులు మూసేయండి.. కుటుంబాలను కాపాడండి

- విచ్చలవిడి మద్యంతో రోడ్డున పడుతున్న సంసారాలు
- పోలీస్ స్టేషన్, జీపీలో ఫిర్యాదు చేసిన పిట్టలగూడెం వాసులు


SI గారికి
ఇట్లు
గ్రామ ప్రజలు పిట్టలగూడెం
1) K. Ravi
6) T కనకలక్ష్మి

**తొలివెలుగు, రాజపేట :** రాజపేట మండలం నెమిల మదిర గ్రామమైన పిట్టలగూడెంలో విచ్చలవిడిగా కొనసాగుతున్న బెల్ట్ షాపులను తక్షణమే మూసివేయాలని కోరుతూ గ్రామస్థులు సోమవారం పోలీస్ స్టేషన్‌తో పాటు గ్రామపంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. గ్రామంలో అక్రమ మద్యం విక్రయాల వల్ల అనేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మద్యపానానికి బానిసైన వారి వల్ల భార్యాభర్తలు, తండ్రీకొడుకులు, గ్రామంలోని యువకుల మధ్య నిత్యం గొడవలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. రాత్రి వేళల్లో మహిళలు బయటకు రావాలంటేనే భయపడే పరిస్థితి నెలకొందని తెలిపారు. అధికారులు, పోలీసులు తక్షణమే స్పందించి బెల్ట్ షాపులను ఎత్తివేసి గ్రామంలో శాంతిభద్రతలను కాపాడాలని డిమాండ్ చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో స్థానికులు రవి, కవిత, పెంటమ్మ, అనిత, కనకలక్ష్మి, పూలమ్మ, కళావతి, సరోజ, గౌరమ్మ, పెంటమ్మ, చంద్రకళ, బొంబాయి, పవిత్ర, రాజమ్మ, చిలకమ్మ, అనూష, చెట్టమ్మ తదితరులు ఉన్నారు.

# రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా డైరెక్టర్‌గా మేక వెంకటేశ్వర్లురెడ్డి

- యాదాద్రి భువనగిరి జిల్లా మేనేజింగ్ కమిటీకి విజయం
- 30 ఏళ్లుగా కొనసాగుతున్న సామాజిక సేవకు గుర్తింపు




**తొలివెలుగు, రాజపేట :** రాజపేట మండలం నెమిల గ్రామానికి చెందిన ప్రముఖ సేవా తత్పరుడు మేక వెంకటేశ్వర్లురెడ్డి ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ యాదాద్రి భువనగిరి జిల్లా మేనేజింగ్ కమిటీ సభ్యుడిగా (డైరెక్టర్) ఎన్నికయ్యారు. మొత్తం 15 డైరెక్టర్ పదవులకు గాను ఎక్కువ సంఖ్యలో నామినేషన్లు దాఖలు కావడంతో ఈ నెల 4న ఎన్నికలు నిర్వహించారు. వెలువడిన ఫలితాల్లో వెంకటేశ్వర్లురెడ్డి విజయం సాధించారు. గత 30 ఏళ్లుగా నెమిల గ్రామంతో పాటు మండల వ్యాప్తంగా ఆయన రక్తదాన శిబిరాల నిర్వహణ, ఆపదలో ఉన్న బాధితులను ఆసుపత్రులకు తరలించడం, అంతిమయాత్రల్లో భాగస్వామ్యం కావడం లాంటి అనేక సేవా కార్యక్రమాలు అందిస్తున్నారు. సేవారంగానికి ఆయన చేసిన కృషికి గాను గతంలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ అధికారుల నుంచి ప్రశంసా పత్రం కూడా అందుకున్నారు. వెంకటేశ్వర్లురెడ్డి విజయం పట్ల మండల ప్రజలు, ప్రజాప్రతినిధులు, జర్నలిస్టులు హర్షం వ్యక్తం చేశారు. ఆయన్ను గెలిపించిన ఓటర్లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ పలువురు నేరుగా, సామాజిక మాధ్యమాల ద్వారా శుభాకాంక్షలు తెలిపారు.

# మృతుల కుటుంబాలకు 'బీర్ల ఫౌండేషన్' ఆసరా

- చల్లూరులో ఆరు కుటుంబాలకు 50 కేజీల చొప్పున బియ్యం అందజేత
- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఆదేశాలతో సహాయం: శాగ నవీన్ కుమార్



**తొలివెలుగు, రాజపేట :** రాజపేట మండలం చల్లూరు గ్రామంలో ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందిన ఆరుగురి కుటుంబాలకు 'బీర్ల ఫౌండేషన్' ఆధ్వర్యంలో సోమవారం నిత్యావసర బియ్యాన్ని పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన మహేశ్వరం నరహరి, కడవేరుగు బిక్షపతి, మహేశ్వరం నరసయ్య, మద్ది జనార్దన్, గుంటి విజయ, సట్టా రాములు కుటుంబాలకు కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు శాగ నవీన్ కుమార్ ఆధ్వర్యంలో ఒక్కొక్కరికి 50 కేజీల చొప్పున బియ్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఆదేశాల మేరకు, బీర్ల ఫౌండేషన్ చైర్మన్ బీర్ల అనిత సహకారంతో బాధిత కుటుంబాలను ఆదుకోవడానికి ఈ బియ్యం పంపిణీ చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చల్లూరు గ్రామ సర్పంచ్ రూప బాల్ నర్సయ్య, ఉపసర్పంచ్ బొంత సుధాకర్, పీఏసీఎస్ డైరెక్టర్ చిట్కూరి గౌరయ్య, నాయకులు మునిగడప కనకయ్య, బడే ఎల్లయ్య, వార్డు సభ్యుడు గణపురం శ్రీకాంత్, మహేశ్వరం సుధాకర్, భీమగాని కృష్ణ, పెంట శ్రీహరి, కొండపాక మధు, గుంటి శ్రీరాములు, మీసా కృష్ణ, చాడ బంగారి, గణపురం మార్కండేయ, సిదారపు మహేందర్, కోల కనకయ్య, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# 'సనాతన ధర్మం' విశ్వవ్యాప్తం

- వైభవంగా 'సనాతన ధర్మ సహస్ర సూత్రాలు' గ్రంథావిష్కరణ
- రమణేశ్వరంలో భక్తజనసందోహం..
- పాల్గొన్న పీఠాధిపతులు, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, జస్టిస్ చంద్రకుమార్



**తొలివెలుగు, యాదాద్రి భువనగిరి :** సకల ప్రజల శ్రేయస్సే ధ్యేయంగా నిలిచేదే నిజమైన సనాతన ధర్మమని సిద్ధగురు రమణానంద మహర్షి స్పష్టం చేశారు. ఆధ్యాత్మిక దివ్యక్షేత్రమైన రమణేశ్వరంలో సోమవారం 'సనాతన ధర్మ సహస్ర సూత్రాలు' గ్రంథావిష్కరణ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన పీఠాధిపతులు, మఠాధిపతులు, మహామండలేశ్వరులతో పాటు శాసనమండలి సభ్యులు అద్దంకి దయాకర్, హైకోర్టు మాజీ జడ్జి జస్టిస్ చంద్రకుమార్, ఆధ్యాత్మికవేత్త చెన్నప్ప ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ?ఈ సందర్భంగా సిద్ధగురు రమణానంద మహర్షి మాట్లాడుతూ... వేద వేదాంగాలు, ఉపనిషత్తుల పరమార్థమే సనాతన ధర్మమని వివరించారు. మానవాళికి ఈ ధర్మాన్ని సులభంగా అందించేందుకే సంస్కృతంలో 1008 దివ్య సూత్రాలతో ఈ గ్రంథాన్ని రచించానని, సామాన్యులకు అర్థమయ్యేలా తెలుగు తాత్పర్యంతో పాటు వివరమైన వివరణ జోడించినట్లు తెలిపారు. అనంతరం సభలో గ్రంథంలోని 9 ముఖ్యమైన దివ్య సూత్రాలను స్వయంగా బోధించారు. ఈ గ్రంథం ప్రతి ఒక్కరూ అధ్యయనం చేయదగిన విశిష్ట మార్గదర్శకమని విచ్చేసిన జగద్గురువులు కొనియాడారు. అంతకుముందు బంగారు శివలింగానికి విశేష అభిషేకం నిర్వహించారు. అనంతరం సిద్ధగురు రమణానంద మహర్షి రచించిన గ్రంథాన్ని పీఠాధిపతుల సమక్షంలో దివ్యంగా ఆవిష్కరించి, ఆయన్ను ప్రత్యేకంగా అభినందించారు. భక్తులకు ఘనంగా అన్నదానం నిర్వహించారు.




# 5 నిమిషాల్లో రూ. 2 కోట్ల బంగారం లూటీ!

**తొలివెలుగు, హైదరాబాద్/మేడిపల్లి:** హైదరాబాద్ శివారులోని మేడిపల్లి పోలీసుస్టేషన్ పరిధిలో సోమవారం తెల్లవారుజామున భారీ చోరీ జరిగింది. వరంగల్ జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న ఓ జ్యువెలరీ దుకాణాన్ని అంతర్రాష్ట్ర దొంగల ముఠా కొల్లగొట్టి కేవలం 5 నిమిషాల్లో ఏకంగా రూ. 2 కోట్ల విలువజేసే 1.4 కిలోల బంగారు, వజ్రాభరణాలతో పరారైంది. పోలీసు స్టేషన్‌కు కూతవేటు దూరంలోనే ఈ చోరీ జరగడం గమనార్హం. సీసీ కెమెరాల్లో నమోదైన దృశ్యాలను అధ్యయనం చేసిన పోలీసులు దుకాణం షెట్టర్ రోడ్డుపై ఉన్న వారికి కనిపించకుండా తెల్లని వస్త్రం అడ్డుపెట్టి దొంగలు ఈ నేరం చేసినట్లు తేల్చారు. రాజస్తాన్‌కు చెందిన ఏడుగురు ఈ చోరీకి పాల్పడి ఉంటారని భావిస్తున్నారు. నిందితుల కోసం ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. హనుమకొండకు చెందిన వెలిశెట్టి సుబ్రహ్మణ్యం టాటా కంపెనీకి చెందిన క్యారెట్‌లేన్ జ్యువెలరీ దుకాణాల ఫ్రాంచైజీ కలిగి ఉన్నారు. హనుమకొండలో ఒకటి, మేడిపల్లి బుద్ధనగర్‌లో మరొకటి నిర్వహిస్తున్నారు. అయితే ఈ జ్యువెలరీ ఫ్రాంచైజీకి కాపలాగా సెక్యూరిటీ గార్డు లేకపోవడంతో దొంగలు దీన్ని టార్గెట్ చేశారు. ఒకటిరెండు రోజులు గమనించి పక్కా పథకం ప్రకారం సోమవారం తెల్లవారుజామున పంజా విసిరారు. మొత్తం ఏడుగురు సభ్యులతో కూడిన ముఠా తెల్లవారుజామున 4 గంటల ప్రాంతంలో ఈ దుకాణం వద్దకు చేరుకుంది. రహదారి పక్కన ప్రయాణికుల మాదిరిగా నిల్చున్న దొంగలు దుకాణం పరిసరాలను పరిశీలించి కాసేపు దూరంగా వెళ్లారు. ఆపై తెల్లవారుజామున 4:07 గంటలకు దుకాణం షట్టర్ వద్దకు ముగ్గురు రాగా మిగిలిన నలుగురు రోడ్డుపైనే ఆగిపోయారు. షట్టర్ వద్దకు వచ్చిన ముగ్గురు దొంగల్లో ఒకడు వెంట తెచ్?చన ఓ వస్త్రాన్ని షెట్టర్‌కు అడ్డుగా పెట్టి నిల్చోగా మిగిలిన ఇద్దరూ షెట్టర్ పక్కనున్న అలారం వైర్లను తొలుత కత్తిరించారు. ఆపై షెట్టర్ తాళాలను పగులగొట్టారు. అనంతరం ఆ వస్త్రాన్ని దుకాణం ఎదురుగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ మాటున దాచి కాస్త దూరంగా వెళ్లి వాహనాల రాకపోకలు, జనసంచారమేదీ లేదని నిర్ధారించుకున్నారు. తెల్లవారుజామున 4:18 గంటలకు రోడ్డుపై ముగ్గురు కాపు కాయగా... నాలుగో వ్యక్తి ఆ వస్త్రాన్ని షట్టర్‌కు మరోసారి అడ్డుగా పెట్టి నిల్చున్నాడు. మిగిలిన ముగ్గురూ ఆ తెరను చాటుగా చేసుకొని షెట్టర్ వద్ద నక్కారు.



# టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

**కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు**

**విజయవాడ, తొలివెలుగు:** విజయవాడ రూరల్ మండలం నిడమానూరు గ్రామానికి చెందిన పలువురు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలుగుదేశం పార్టీలో చేరారు. గ్రామ టీడీపీ అధ్యక్షుడు బండి వెంకట్రావు (నాని) ఆధ్వర్యంలో మాజీ ఎంపీటీసీ (కో-ఆప్షన్ సభ్యుడు) ఎం.డి. ఇస్మాయిల్, మాజీ సర్పంచ్ సోమన సాయిబాబు తమ అనుచరులతో కలిసి టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు వారికి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కూటమి నాయకులతో సమన్వయంతో పనిచేస్తూ గ్రామ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. నిడమానూరు గ్రామంలో టీడీపీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో నిడమానూరు గ్రామ పీఏసీఎస్ అధ్యక్షుడు కానూరు యుగంధర్, టీడీపీ క్లస్టర్--3 ఇన్‌చార్జి అడుసుమిల్లి నవీన్, స్థానిక టీడీపీ నాయకులు మాదాల నాని బాబు, అరవపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# మాజీ మంత్రి కారుమూరిని హైదరాబాద్ జైలు నుంచి విజయవాడ తరలింపు

**మద్యం రవాణా స్కాంలో మాజీ మంత్రి కారుమూరికి సిట్ కస్టడీ**

**కుమారుడికి సబ్ కాంట్రాక్టు ఇప్పించి నిధులు స్వాహా చేశారని ఆరోపణలు**

**కుమారుడు, కోడలి ఖాతాల్లోకి 85 శాతం నిధులు మళ్లినట్లు గతంలో ఈడీ గుర్తింపు**

**ఈ నెల 9 వరకు కారుమూరిని ప్రశ్నించనున్న సిట్ అధికారులు**



**విజయవాడ, తొలివెలుగు:** ఏపీ మద్యం రవాణా కుంభకోణం కేసులో విచారణ వేగవంతమైంది. ఈ కేసులో కీలక ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావును ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అధికారులు తమ కస్టడీలోకి తీసుకున్నారు. హైదరాబాద్ జైలులో ఉన్న ఆయన్ను సోమవారం విజయవాడకు తరలించారు. విజయవాడలో వైద్య పరీక్షలు పూర్తి చేసిన అనంతరం, ఈ నెల 9వ తేదీ వరకు జైలులో ఆయనను ప్రశ్నించనున్నారు. ఈ కుంభకోణానికి సంబంధించి మరిన్ని కీలక వివరాలు రాబట్టడమే లక్ష్యంగా సిట్ అధికారులు కారుమూరిని కస్టడీలోకి తీసుకున్నారు. ఈ కేసుపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కూడా దర్యాప్తు చేపట్టింది. మంత్రిగా తన అధికారాన్ని దుర్వినియోగం చేసి కారుమూరి నాగేశ్వరరావు, మద్యం రవాణా సబ్ కాంట్రాక్టును తన కుమారుడు కారుమూరి సునీల్‌కు ఇప్పించారని ఈడీ తన దర్యాప్తులో గుర్తించింది. దీనికోసం 'సుదర్శన్ కన్‌స్ట్రక్షన్స్' అనే ఒక ముసుగు సంస్థను ఏర్పాటు చేసి, 'సిగ్మా లాజిస్టిక్స్'తో ఒప్పందం కుదిర్చింది కూడా నాగేశ్వరరావేనని ఈడీ తేల్చింది. ఈ కుంభకోణం ద్వారా అక్రమంగా సంపాదించిన సొమ్ములో ఏకంగా 85 శాతం ఆయన కుమారుడు సునీల్, కోడలు కీర్తి బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా జమ అయినట్లు ఈడీ ఆధారాలు సేకరించినట్టు తెలుస్తోంది. ఈ నిధులను విజయవాడ, తణుకు నియోజకవర్గాల్లోని కారుమూరి క్యాంపు కార్యాలయాల నిర్వహణ, వాహనాలకు డీజిల్, ఇతర ప్రయాణ ఖర్చులకు వినియోగించినట్లు కూడా గుర్తించింది. ఈడీ దర్యాప్తులో వెల్లడైన అంశాలపై మరింత లోతుగా విచారణ జరిపేందుకు సిట్ అధికారులు ఇప్పుడు కారుమూరిని ప్రశ్నించనున్నారు.

# 2029 నాటికి 4-స్టార్.. ప్రభుత్వ స్కూళ్లపై మంత్రి లోకేశ్ సమీక్ష.. అధికారులకు కీలక ఆదేశాలు!

**ఏడాదిలోగా వన్-స్టార్ స్కూళ్లను టూ-స్టార్‌గా మార్చాలని ఆదేశం**

**2029 నాటికి రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో 4-స్టార్ సదుపాయాల కల్పన లక్ష్యం**

**ఈ ఏడాది 5 లక్షల మంది విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలని నిర్ణయం**

**ఏజెన్సీ ప్రాంత పాఠశాలల అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచన**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఈ విషయంలో నిర్దేశిత లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా చేరుకోవాలని రాష్ట్ర ఐటీ, విద్య, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. పాఠశాలల్లో వసతుల కల్పన, నైపుణ్యాభివృద్ధి అంశాలపై సోమవారం ఉండవల్లిలోని తన నివాసంలో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. ఏడాదిలోగా రాష్ట్రంలోని వన్-స్టార్ పాఠశాలలన్నింటినీ టూ-స్టార్ స్థాయికి అప్‌గ్రేడ్ చేయాలని స్పష్టం చేశారు. అలాగే, ప్రస్తుత విద్యా సంవత్సరంలోగా జీరో-స్టార్ రేటింగ్ ఉన్న పాఠశాలలన్నింటినీ కనీసం వన్-స్టార్ స్థాయికి చేర్చాలని సూచించారు. 2029 నాటికి రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలను 4-స్టార్ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలని, కనీసం వెయ్యి పాఠశాలలను 5-స్టార్ స్థాయికి చేర్చేలా పటిష్ఠ ప్రణాళికలు రూపొందించాలని దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా ఏజెన్సీ, వెనుకబడిన ప్రాంతాల్లోని పాఠశాలల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. నియోజకవర్గానికి ఒకటి చొప్పున 175 "లీప్ స్కూళ్లను" అభివృద్ధి చేసేందుకు అవసరమైన కార్యాచరణ సిద్ధం చేయాలని కోరారు. ప్రస్తుతం రాష్ట్రంలో 1,685 వన్-స్టార్... 15,618 టూ-స్టార్... 19,099 త్రీ-స్టార్... 7,172 ఫోర్-స్టార్ పాఠశాలలు ఉన్నాయని అధికారులు మంత్రికి వివరించారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల పురోగతిపై డీఈవోలు, ఎంఈవోలు, సీఆర్పీలకు బాధ్యతలు అప్పగించాలని లోకేశ్ సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 7 వేల హైస్కూళ్లలో పూర్తిస్థాయిలో కంప్యూటర్ ల్యాబ్స్, అటల్ టింకరింగ్ ల్యాబ్స్ ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. అకడమిక్ సంస్కరణలు పూర్తయినందున, ఇకపై అధికారులు, ఉపాధ్యాయులు పూర్తిగా అభ్యసన ఫలితాల మెరుగుదలపైనే దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. విద్యార్థులకు నైపుణ్య శిక్షణ అందించేందుకు కేంద్ర ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని మంత్రి లోకేశ్ ఆదేశించారు. ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన (పీఎంకేవీవై) ద్వారా ఈ ఏడాది 5 లక్షల మంది విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించారు. ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్, నేషనల్ అప్రెంటిస్‌షిప్ స్కీమ్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాలని సూచించారు.

# వాస్తవాలను వెలికి తీసిన 'ప్రజాశక్తి' విలేకరిపై దాడి

**విచక్షణారహితంగా చితకబాదిన దుండగులు.**

**దాడిపై ఏపీడబ్ల్యూజేఎఫ్ ఖండన**

**దాడి చేసిన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలి : సీపీఎం**





**కాకినాడ, తొలివెలుగు:** అక్రమ నిర్మాణాలు, భూ వ్యవహారాలపై వాస్తవాలను వెలుగులోకి తెస్తున్న ప్రజాశక్తి విలేకరిపై దాడి జరగడం ప్రత్తిపాడు మండలంలో కలకలం రేపింది. లంపకలోవ గ్రామంలో డి.పట్టా భూముల్లో నిర్మాణ పనులు జరుగుతున్నాయన్న సమాచారంతో కవరేజ్‌కు వెళ్లిన ప్రజాశక్తి ప్రత్తిపాడు విలేకరి ఎస్.రమేష్‌పై కొందరు వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. చేతిలో ఉన్న మొబైల్‌ఫోన్‌ను లాక్కొని, కర్రలతో విచక్షణారహితంగా కొట్టినట్లు బాధిత విలేకరి తెలిపారు. ఈ ఘటనను ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ఏ (పీడబ్ల్యూజేఎఫ్) జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. యాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వాతాడ నవీన్ రాజ్, ముమ్మిడి లక్ష్మణ్ లు డిమాండ్ చేశారు. దాడికి పాల్పడిన వారిపై పోలీసులు తక్షణమే చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు డిమాండ్ చేసారు. తన కథనాల ద్వారా వాస్తవాలను వెలుగుతీస్తున్న రమేష్ పై దాడి అత్యంత హేయమైన చర్య అని పత్తిపాడు ప్రింట్ మీడియా ప్రతినిధులు తీవ్రంగా ఖండించారు.

### నోటీసులు ఇచ్చినా కొనసాగుతున్న పనులు

మండలంలోని లంపాకలోవ గ్రామంలో కాకి అంతలక్ష్మి పేరుతో ఉన్న డి.పట్టా భూమిలో గోశాల నిర్మాణానికి పి.వేమవరానికి చెందిన మాగాపు గణపతి ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంపై ప్రజాశక్తి విలేకరి రమేష్ ఇటీవల పలు వార్తా కథనాలు రాశారు. దీంతో స్పందించిన రెవెన్యూ అధికారులు సంబంధిత భూముల్లో నిర్మాణ పనులు చేపట్టవద్దంటూ నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. అయితే రెవెన్యూ అధికారుల నోటీసులను పట్టించుకోకుండా అక్కడ తవ్వకాలు, నిర్మాణ పనులు కొనసాగుతున్నట్లు విలేకరి పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రజాశక్తి డివిజన్ ఇన్‌చార్జి జి.ఇస్సాక్‌తో కలిసి రమేష్ ప్రత్తిపాడు నుంచి లంపాకలోవకు వెళ్తుండగా, నోటీసులు ఇచ్చిన భూమిలో పనులు కొనసాగుతున్నట్లు గుర్తించారు.

### ఫొటోలు తీస్తుండగా దాడి

రోడ్డు మీద నుంచి జరుగుతున్న పనులను రమేష్ తన మొబైల్‌ఫోన్‌లో ఫొటోలు తీస్తుండగా, అక్కడ పనులు చేపడుతున్న మాగపు గణపతి, కోర్ని ప్రకాష్, దాలే సతీష్, భారత్ రాఘవ (నాని)తో పాటు మరో వ్యక్తి రమేష్ వద్దకు వచ్చినట్లు తెలిపారు. 'ఎందుకు ఫొటోలు తీస్తున్నావు?' అంటూ ప్రశ్నించి, ఆయన చేతిలోని మొబైల్‌ఫోన్‌ను లాక్కొని కర్రలతో దాడి చేశారు. ఈ దాడిలో రమేష్‌కు గాయాలై రక్తస్రావం జరిగింది. వెంటనే ఆయనను ప్రత్తిపాడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు విలేకరి తెలిపాడు. విధి నిర్వహణలో భాగంగా ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తున్న పాత్రికేయుడిపై దాడి చేయడం సరికాదని పలువురు జర్నలిస్టుల ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఘటనపై పోలీసులు సమగ్ర దర్యాప్తు చేపట్టి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దాడికి పాల్పడిన వారిని వెంటనే గుర్తించి అరెస్టు చేయాలని, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని జర్నలిస్టు సంఘాల నేత నాయకులు సిపిఎం ఇతర ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. దాడిలో గాయపడిన విలేకరి రమేష్‌ను సీఐటీయూ మండల కార్యదర్శి రొంగల ఈశ్వరరావు పరామర్శించారు. ఘటన వివరాలను అడిగి తెలుసుకుని, బాధితుడికి అండగా ఉంటామని తెలిపారు. పాత్రికేయులు విధి నిర్వహణలో ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా పోలీసులు రక్షణ కల్పించాలని కోరారు. ఇదిలా ఉండగా, లంపాకలోవలో డి.పట్టా భూములకు సంబంధించిన వ్యవహారం, అక్కడ జరుగుతున్న నిర్మాణాలు, రెవెన్యూ అధికారులు జారీ చేసిన నోటీసులపై సంబంధిత అధికారులు సమగ్రంగా విచారణ జరపాలని స్థానికులు కోరుతున్నారు. భూమి హక్కులు, నిర్మాణాలకు అనుమతులు, నోటీసుల అమలు తదితర అంశాలపై స్పష్టత ఇవ్వాలని, అక్రమాలు ఉన్నట్లు తేలితే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# ఇంటింటికీ జలధార.. రూ.30,156 కోట్లతో బృహత్ పథకం ప్రారంభించిన చంద్రబాబు, పవన్

- ప్రొద్దుటూరులో 'అమరజీవి జలధార' పనులకు శ్రీకారం
- రూ.30,156 కోట్లతో 27 లక్షల కుటుంబాలకు సురక్షిత తాగునీరు
- రాయలసీమ రైజింగ్‌ను ఎవరూ అడ్డుకోలేరన్న చంద్రబాబు
- గోదావరి పుష్కరాల లోపు పోలవరం పూర్తి చేస్తామని హామీ
- గత ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు
- గొడ్డలి పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పారన్న సీఎం



**ప్రొద్దుటూరు,తొలివెలుగు:** గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీటిని అందించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. జల్ జీవన్ మిషన్ 2.0లో భాగంగా రూ.30,156 కోట్ల భారీ వ్యయంతో చేపట్టిన 'అమరజీవి జలధార' పనులను ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సోమవారం ప్రారంభించారు. కడప జిల్లా ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని కొత్తపల్లిలో వారు పైలాన్‌ను ఆవిష్కరించి ఈ బృహత్ పథకానికి అంకురార్పణ చేశారు. ఈ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా మరో 27 లక్షల గ్రామీణ కుటుంబాలకు కొత్తగా కుళాయి కనెక్షన్లు అందించనున్నారు. ఇందుకోసం 13,075 ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం, 77,243 కిలోమీటర్ల పైపులైన్ల విస్తరణ పనులు చేపట్టనున్నారు. ఈ పనులు పూర్తయితే రాష్ట్రంలో మొత్తం 3.3 కోట్ల మందికి సురక్షిత తాగునీరు అందుబాటులోకి వస్తుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఇప్పటికే 62 లక్షల కుటుంబాలకు కుళాయి కనెక్షన్లు ఉండగా, ఈ కొత్త పథకంతో గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది.

### రాయలసీమ రైజింగ్.. అభివృద్ధి ఆగదు

ఈ సందర్భంగా ప్రొద్దుటూరులో నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రసంగించారు. రాయలసీమకు 'రప్పారప్పా' రాజకీయం కాదని, అభివృద్ధి, సంక్షేమం కావాలని స్పష్టం చేశారు. రాయలసీమ అభివృద్ధి బుల్లెట్‌లా దూసుకెళ్తుందని, దానిని ఎవరూ ఆపలేరని అన్నారు. రూ.1 లక్ష కోట్లతో గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ఏర్పాటు చేసి సీమ దశ, దిశ మారుస్తామని ప్రకటించారు. భవిష్యత్తులో శత్రు దేశాలను చీల్చిచెండాడే ఫైటర్ జెట్లు 'మేడ్ ఇన్ రాయలసీమ' అని చెప్పుకునే రోజులు వస్తాయని, ఇక్కడ పండే ఫలాలు 'రాయలసీమ బ్రాండ్'తో ప్రపంచ మార్కెట్లకు ఎగుమతి అవుతాయని ధీమా వ్యక్తం చేశారు. రానున్న గోదావరి పుష్కరాల లోపే పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి ప్రధాని మోదీ చేతుల మీదుగా జాతికి అంకితం చేస్తామని పునరుద్ఘాటించారు. గత ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. 2024 ఎన్నికల్లో ప్రజలు గొడ్డలి పార్టీకి గట్టిగా బుద్ధి చెప్పారని వ్యాఖ్యానించారు. వివేకా హత్య కేసు నుంచి మద్యం కుంభకోణం వరకు అన్ని వేళ్లూ ఆ పార్టీ అధినేత వైపే చూపిస్తున్నాయని ఆరోపించారు. కుట్రలు, ఫేక్ ప్రచారమే ఆ పార్టీ సిద్ధాంతమని, వారి డీఎన్‌ఏలోనే నేరాలు చేసి ఇతరులపై నెట్టేయడం ఉందని ఎద్దేవా చేశారు. అసెంబ్లీకి రాకుండా ప్రతిపక్ష హోదా కోరడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. కేంద్రం, రాష్ట్రంతో పాటు స్థానిక సంస్థల్లోనూ కూటమి అధికారంలో ఉంటే 'ట్రిపుల్ ఇంజిన్ సర్కార్'తో అభివృద్ధి వేగవంతం అవుతుందని సీఎం చంద్రబాబు అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఎస్.సవిత, పి.నారాయణ, బీసీ జనార్ధన్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# వివేకా హత్య కేసులో జగన్ మౌనం నేరాంగీకారమే: మంత్రి రాంప్రసాద్ రెడ్డి

**ప్రొద్దుటూరు,తొలివెలుగు:** సొంత బాబాయ్ వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో దర్యాప్తు సంస్థలన్నీ ఆధారాలతో తాడేపల్లి ప్యాలెస్ వైపే చూపిస్తున్నప్పటికీ, మాజీ ముఖ్యమంత్రి జగన్ మౌనం వహించడం ఆయన నేరాన్ని అంగీకరించడమేనని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తీవ్రంగా ధ్వజమెత్తారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, కడప ఎంపీ టికెట్ కోసం ఏకంగా రూ.40 కోట్ల సుపారీ ఇచ్చి సొంత కుటుంబాన్నే బలితీసుకున్న చరిత్ర జగన్‌ది కాదా అని సూటిగా ప్రశ్నించారు. ఈడీ, సీబీఐ వంటి సంస్థలు దర్యాప్తును వేగవంతం చేస్తుంటే, సమాధానం చెప్పలేక జగన్ ముఖం చాటేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఐదేళ్ల పాటు ముఖ్యమంత్రి పదవిని అడ్డుపెట్టుకుని ఈ కేసును నీరుగార్చారని, పులివెందులలోకి కేంద్ర దర్యాప్తు అధికారులు రాకుండా అడ్డుకున్నది వైసీపీ ప్రభుత్వమేనని ఆయన ఆరోపించారు. ఒకవైపు వైసీపీ విధ్వంసకర రాజకీయాలకు పాల్పడుతుంటే, తమ కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పరుగులు పెట్టిస్తోందని మంత్రి పేర్కొన్నారు. ప్రొద్దుటూరు వేదికగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కలిసి 61.60 లక్షల కుళాయిల ద్వారా 27.36 లక్షల కుటుంబాలకు తాగునీరు అందించే 'జలజీవన్ మిషన్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. 'పల్లె పండుగ 3.0' కింద రూ.1,185 కోట్లతో సీసీ, బీటీ రోడ్లు, మినీ గోకులాలు, మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణం ముమ్మరంగా సాగుతోందన్నారు. పీఎంఏవై గ్రామీణ్ 2.0 ద్వారా రాష్ట్రంలో రూ.7,170 కోట్లతో పేదలకు మూడు లక్షల పక్కా ఇళ్లు నిర్మిస్తున్నామని వివరించారు. గత వైసీపీ ప్రభుత్వం సెంటున్నర స్థలం పేరుతో భూదందాలకు పాల్పడితే, తాము పారదర్శకంగా సంక్షేమ ఫలాలను అర్హులకు అందిస్తున్నామని స్పష్టం చేశారు. రాయలసీమ సాగునీటి కష్టాలను తీర్చడానికి ఎన్టీఆర్ హంద్రీ-నీవా ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తే, చంద్రబాబు తన పాలనలో నిధులు కేటాయించి కుప్పం వరకు కృష్ణా జలాలను తీసుకువచ్చారని రాంప్రసాద్ రెడ్డి గుర్తుచేశారు.

TGTEL/26/A6221
తొలివెలుగు
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం.. జాతీయపత్రిక
యాదాద్రి భువనగిరి మంగళవారం 06 అక్టోబర్ 2026




# తెలంగాణలో డైనోసార్లు తిరిగాయా? మంచిర్యాల అడవుల్లో దాగిన కోట్ల ఏళ్ల రహస్యం!

**వేమనపల్లి ప్రాంతంలో డైనోసార్ అవశేషాల గుర్తింపు**
**1984లో అవశేషాలు బయటపడినట్లు సమాచారం**
**ప్రాణహిత పరివాహకంలో శిలాజాల ఆనవాళ్లు**
**రాజారంలో కాకతీయుల కాలం నాటి విగ్రహాలు**
**12వ శతాబ్దానికి చెందిన దశావతార విగ్రహాలు**

**మంచిర్యాల, తొలివెలుగు:** తెలంగాణ అంటే చారిత్రక కోటలు, దేవాలయాలు, పచ్చని అడవులు గుర్తొస్తాయి. కానీ.. ఈ నేలపై కోట్ల ఏళ్ల క్రితం డైనోసార్లు సంచరించాయంటే నమ్మగలరా? మంచిర్యాల జిల్లాలోని వేమనపల్లి ప్రాంతం అలాంటి ఆసక్తికర విషయాలను తనలో దాచుకుంది. ప్రాణహిత నది పరీవాహక ప్రాంతంలో డైనోసార్ అవశేషాలు, వివిధ జీవుల శిలాజాలు బయటపడినట్లు స్థానిక కథనాలు చెబుతున్నాయి. అదే ప్రాంతంలో కాకతీయుల కాలం నాటి చారిత్రక ఆనవాళ్లు కూడా ఉండటం విశేషం. మహారాష్ట్ర సరిహద్దుకు సమీపంలో ప్రాణహిత నది ప్రవహించే ప్రాంతమే వేమనపల్లి. 1984లో మంగెనపల్లి అటవీ ప్రాంతంలో భూగర్భ, పురావస్తు శాఖ అధికారులు డైనోసార్ అవశేషాలను గుర్తించారు. సుమారు 14 మీటర్ల పొడవు, 5.5 మీటర్ల ఎత్తు ఉన్న జీవికి చెందిన అవశేషాలు బయటపడటంతో అప్పట్లో సంచలనం రేగింది. సుంపుటం, ఒడ్డుగూడెం, మంగెనపల్లి ప్రాంతాల్లోనూ అవశేషాలు లభించినట్లు స్థానికులు చెబుతున్నారు. వేమనపల్లి పరిసరాల్లో శిలాజీకరణ చెందిన చెట్ల ఆనవాళ్లు కూడా కనిపిస్తాయని స్థానికులు చెబుతున్నారు. వాగులు, నది మలుపుల వెంట వివిధ ఆకారాల్లో రాళ్లు కనిపిస్తుంటాయి. వాటిలో కొన్ని చేపలు, సముద్ర నక్షత్రాలు, తాబేళ్ల ఆకారాలను పోలి ఉంటాయని చెబుతున్నారు. భారీ వర్షాలు, వరదల సమయంలో చెట్లు ఇసుక పొరల్లో కూరుకుపోయి.. చాలా కాలానికి శిలాజాలుగా మారి ఉండొచ్చని భావిస్తున్నారు. వేమనపల్లి ప్రత్యేకత డైనోసార్లతోనే ఆగిపోలేదు. రాజారం గ్రామంలోని దశావతార విగ్రహాలు సుమారు 12వ శతాబ్దానికి చెందినవిగా భావిస్తున్నారు. ఇవి కాకతీయుల కాలం నాటి చారిత్రక ఆనవాళ్లుగా గుర్తింపు పొందాయి. అంటే.. ఒకవైపు కోట్ల ఏళ్ల క్రితం జీవించిన జీవుల ఆనవాళ్లు.. మరోవైపు శతాబ్దాల క్రితం మనుషులు నిర్మించిన చారిత్రక గుర్తులు ఇక్కడ కనిపిస్తాయి. ప్రాణహిత నది, దట్టమైన అడవులు, అరుదైన వృక్షజాతులు, శిలాజాలు, డైనోసార్ అవశేషాలు, కాకతీయుల కాలం నాటి విగ్రహాలు.. ఇలా వేమనపల్లిలో ప్రకృతి, చరిత్ర, భూగర్భ రహస్యాలు ఒకే చోట కనిపిస్తాయి. ఈ ప్రాంతంలోని పురాతన ఆనవాళ్లపై మరింత శాస్త్రీయ పరిశోధన జరిగితే తెలంగాణ గతానికి సంబంధించిన ఎన్నో ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

# ఓటుకు నోటు కేసులో కీలక మలుపు.. సుప్రీంకోర్టులో స్టీఫెన్‌సన్ ఇంప్లీడ్ పిటిషన్



**ఓటుకు నోటు కేసులో సుప్రీంకోర్టును ఆశ్రయించిన మాజీ ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్**
**ఈ కేసులో తనను ఇంప్లీడ్ చేయాలని పిటిషన్ దాఖలు**
**బాధితుడిగా తన వాదనలు వినాలని కోర్టుకు విజ్ఞప్తి**
**కేసును కొట్టివేయాలన్న రేవంత్ రెడ్డి పిటిషన్‌పై విచారణ వేళ ఈ పరిణామం**
**పిటిషన్‌ను పరిగణనలోకి తీసుకున్న సుప్రీం, విచారణ వాయిదా**

తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన 2015 నాటి ఓటుకు నోటు కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన ఫిర్యాదుదారు, నామినేటెడ్ మాజీ ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తన వాదనలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని కోరుతూ ఆయన సర్వోన్నత న్యాయస్థానంలో ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసు విచారణలో భాగంగా అదనపు వాదనలు వినిపించేందుకు తనకు అవకాశం కల్పించాలని స్టీఫెన్‌సన్ తన పిటిషన్‌లో కోరారు. ప్రధాన ఫిర్యాదుదారుగా తన వాదనలను వినడం నిష్పక్షపాత విచారణకు అత్యంత కీలకమని ఆయన తరఫు న్యాయవాది కోర్టుకు నివేదించారు. ఈ ఇంప్లీడ్ పిటిషన్‌ను భారత ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం పరిగణనలోకి తీసుకుంటూ, తదుపరి విచారణను వాయిదా వేసింది. 2015 జూన్‌లో జరిగిన తెలంగాణ శాసనమండలి ఎన్నికల సందర్భంగా ఈ ఉదంతం వెలుగులోకి వచ్చింది. టీడీపీ అభ్యర్థికి అనుకూలంగా ఓటు వేసేందుకు అప్పటి టీడీపీ ఎమ్మెల్యే రేవంత్ రెడ్డి (ప్రస్తుత తెలంగాణ ముఖ్యమంత్రి) రూ. 50 లక్షలు అడ్వాన్స్‌గా ఇచ్చేందుకు ప్రయత్నించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో తెలంగాణ ఏసీబీ కేసు నమోదు చేసి రేవంత్ రెడ్డి సహా ముగ్గురిని అరెస్ట్ చేయడంతో పాటు నగదును స్వాధీనం చేసుకుంది. ఈ కేసులో ఆడియో, వీడియో రికార్డింగులను కీలక ఆధారాలుగా పేర్కొన్నారు. తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ రేవంత్ రెడ్డి ఇప్పటికే సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ క్వాష్ పిటిషన్‌పై విచారణ జరుగుతున్న తరుణంలో స్టీఫెన్‌సన్ ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. తాజా పరిణామాలతో తెలుగు రాష్ట్రాల రాజకీయ, న్యాయ వర్గాల్లో ఈ కేసు మరోసారి చర్చనీయాంశంగా మారింది. తదుపరి విచారణలో ధర్మాసనం ఎలాంటి నిర్ణయం తీసుకోనుందోనన్న ఉత్కంఠ నెలకొంది.

# కేబీఆర్ పార్క్ చుట్టూ ఇక శాశ్వతంగా వన్‌వే: జీహెచ్ఎంసీ కమిషనర్

**కేబీఆర్ పార్క్ చుట్టూ వన్‌వే ట్రాఫిక్‌ను శాశ్వతం చేసిన జీహెచ్ఎంసీ**
**పాత ప్రాజెక్టులో మార్పులతో ప్రభుత్వానికి రూ.400 కోట్ల ఆదా**
**నాగార్జున సర్కిల్ నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వరకు కొత్త స్టీల్ ఫ్లైఓవర్**
**ఏడాదిలోగా నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యం**
**కేబీఆర్ పార్క్ వద్ద అండర్‌పాస్ కూడా నిర్మించనున్న అధికారులు**



**హైదరాబాద్,తొలివెలుగు:** నగరంలోని కేబీఆర్ పార్క్ చుట్టూ ప్రస్తుతం ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్న వన్-వే ట్రాఫిక్ విధానాన్ని శాశ్వతం చేయనున్నట్లు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ సోమవారం ప్రకటించారు. దీనితో పాటు, ఈ ప్రాంతంలో గతంలో ప్రతిపాదించిన హెచ్-సిటీ ఇన్‌ఫ్రా పనుల్లో కొన్నింటిని రద్దు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ నిర్ణయం ద్వారా సుమారు రూ. 400 కోట్ల మేర ప్రజాధనం ఆదా కానుంది. సోమవారం కేబీఆర్ పార్క్, జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ మార్గాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించిన అనంతరం కమిషనర్ మీడియాతో మాట్లాడారు. వన్-వే విధానం, ఫ్రీ-లెఫ్ట్ టర్న్‌ల ఏర్పాటు వల్ల ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గి, వాహనాల రాకపోకలు మెరుగుపడ్డాయని ఆయన తెలిపారు. సవరించిన ప్రణాళిక ప్రకారం, నాగార్జున సర్కిల్ నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వరకు ఆరు వరుసల స్టీల్ బ్రిడ్జి (ఫ్లైఓవర్) నిర్మిస్తామని, దీనిని ఏడాది కాలంలోనే పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. అలాగే కేబీఆర్ పార్క్ సమీపంలో ఒక అండర్‌పాస్?ను కూడా నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. గతంలో హెచ్-సిటీ ప్రాజెక్టు కింద రూ. 1,090 కోట్ల అంచనా వ్యయంతో కేబీఆర్ పార్క్ చుట్టూ పలు ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు నిర్మాణాన్ని ప్రతిపాదించారు. అయితే, ప్రస్తుతం అమలు చేస్తున్న వన్-వే విధానం విజయవంతం కావడం, కోర్టు కేసుల వంటి పరిణామాల నేపథ్యంలో అధికారులు ఈ ప్రణాళికలను పునఃసమీక్షించారు. ట్రాఫిక్ సమస్యను నివారించేందుకు అత్యవసరమైన చోట మాత్రమే ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు నిర్మించాలని నిర్ణయించారు. ఈ మార్పుల ద్వారా నగరంలోని అత్యంత రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం లభించడమే కాకుండా, పెద్ద ఎత్తున ప్రజాధనం ఆదా అవుతుందని అధికారులు భావిస్తున్నారు.

# టర్ల జాబితా సవరణపై ప్రతిపక్షాల విమర్శలు...

**ఓటర్ల జాబితా సవరణ ఈసీ ప్రక్రియేనన్న రామచందర్ రావు**
**దొంగ ఓటర్లను, చనిపోయిన ఓటర్లను తొలగించడమే లక్ష్యమని వ్యాఖ్య**
**ఓవైసీ, కాంగ్రెస్ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయన్న రామచందర్ రావు**
**ఓడిపోయినప్పుడల్లా ఈసీ, ఈవీఎంలపై నిందలు వేస్తారని విమర్శలు**

**హైదరాబాద్,తొలివెలుగు:** ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) ప్రక్రియపై ప్రతిపక్షాలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు విమర్శించారు. ఇది బీజేపీ చేస్తున్న కార్యక్రమం కాదని, భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) చేపట్టిన ప్రక్రియ అని స్పష్టం చేశారు. దొంగ ఓట్లు, చనిపోయిన వారి ఓట్లను జాబితా నుంచి తొలగించడమే దీని ముఖ్య ఉద్దేశమని ఆయన తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ, “ఈ ప్రక్రియను బీజేపీ ప్రవేశపెట్టలేదు, ఇది ఎన్నికల సంఘం చేపట్టిన ప్రక్రియ అని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ, ఇతర నేతలు తెలుసుకోవాలి. కాంగ్రెస్ హయాంలో కూడా ఇది జరిగింది. అప్పుడు వ్యతిరేకించని వారు ఇప్పుడు ఎందుకు వ్యతిరేకిస్తున్నారు?” అని ప్రశ్నించారు. కేరళలో ఎస్ఐఆర్ తర్వాత కాంగ్రెస్ గెలిచినా, దానికి వారి వద్ద సమాధానం లేదని ఎద్దేవా చేశారు. “కాంగ్రెస్ లేదా ఇండియా కూటమి ఎన్నికల్లో ఓడిపోయినప్పుడల్లా ఈసీపై లేదా ఈవీఎంలపై నిందలు వేయడం అలవాటుగా మారింది. గత 12 ఏళ్లుగా బీజేపీ అధికారంలో ఉండటంతో ఓవైసీ, కాంగ్రెస్ పార్టీలు విరక్తితో ఉన్నాయి. అందుకే ఎస్ఐఆర్ గురించి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నాయి” అని రావు ఆరోపించారు. చనిపోయినవారు, నకిలీ ఓటర్లు, విదేశీయుల పేర్లను తొలగించడం, వేరే ప్రాంతాలకు వలస వెళ్లిన వారి ఓట్లను అక్కడికి మార్చడమే ఎస్ఐఆర్ ఉద్దేశమని ఆయన వివరించారు. కాగా, ఈ ప్రక్రియ ద్వారా ఓటర్లను ఉద్దేశపూర్వకంగా తొలగిస్తున్నారని, ఇది బీజేపీకి లబ్ధి చేకూర్చేందుకేనని ఆరోపిస్తూ ప్రతిపక్షాలు ఆదివారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద, దేశంలోని పలు ప్రాంతాల్లో నిరసనలు చేపట్టాయి. ముసాయిదా జాబితా నుంచి 13 కోట్ల పేర్లను తొలగించారని వారు ఆరోపిస్తున్నారు. అయితే, అధికార బీజేపీ ఈ ఆరోపణలను తోసిపుచ్చింది.



# హనీట్రాప్ సైబర్ మోసం.. రిటైర్డ్ ఉద్యోగి నుంచి రూ.38 లక్షలు వసూలు.!

**హైదరాబాద్,తొలివెలుగు:** హనీట్రాప్ పేరుతో జరిగిన సైబర్ మోసం కేసును పోలీసులు ఛేదించారు. ఓ వయోవృద్ధ రిటైర్డ్ ఉద్యోగిని టార్గెట్ చేసిన సైబర్ నేరగాడు.. మహిళ పేరుతో నకిలీ ఫేస్‌బుక్ ఖాతా సృష్టించి బాధితుడితో పరిచయం పెంచుకున్నాడు. ఆ తర్వాత వివిధ రకాలుగా బెదిరించి ఏకంగా రూ.38 లక్షలు వసూలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. నిందితుడు మహిళ పేరుతో నకిలీ ఫేస్‌బుక్ ప్రొఫైల్‌ను సృష్టించి వయోవృద్ధ రిటైర్డ్ ఉద్యోగికి ఫ్రెండ్ రిక్వెస్ట్ పంపాడు. బాధితుడితో పరిచయం పెంచుకుని నమ్మకం సంపాదించాడు. తొలుత గృహ అవసరాలు, ఇతర కారణాలను చెబుతూ డబ్బులు తీసుకున్నాడు. ఆ తర్వాత బాధితుడితో అసభ్యకరంగా చాటింగ్ చేసి, ఆ సంభాషణలను అడ్డుపెట్టుకుని బెదిరింపులకు పాల్పడ్డాడు. మైనర్ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారంటూ క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని బెదిరించాడు. పోలీసులమంటూ ఫోన్ కాల్స్ చేయడం, కేసులు పెడతామని భయపెట్టడం వంటి పద్ధతులతో బాధితుడి నుంచి దశలవారీగా భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేసినట్లు పోలీసులు తెలిపారు. మొత్తంగా రూ.38 లక్షలు వసూలు చేసినట్లు కేసు దర్యాప్తులో వెల్లడైంది. మోసాన్ని గుర్తించిన బాధితుడు సైబర్ పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక ఆధారాల ఆధారంగా నిందితుడిని గుర్తించిన పోలీసులు అతడిని అరెస్ట్ చేశారు. ఈ కేసులో పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన 26 ఏళ్ల యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి నుంచి రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నకిలీ సోషల్ మీడియా ఖాతాలు, ఫోన్ కాల్స్, చాటింగ్ ద్వారా బాధితుడిని ఎలా ట్రాప్ చేశాడనే అంశాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటన నేపథ్యంలో వృద్ధులను లక్ష్యంగా చేసుకుని నకిలీ సోషల్ మీడియా ఖాతాలతో సైబర్ నేరాలకు పాల్పడుతున్న ఘటనలు పెరుగుతున్నాయని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా మహిళల పేరుతో ఫేక్ ప్రొఫైల్స్ సృష్టించి ఫ్రెండ్ రిక్వెస్టులు పంపడం, పరిచయం పెంచుకుని నమ్మకం సంపాదించడం, ఆ తర్వాత వైద్యం, గృహ అవసరాలు, బహుమతులు వంటి కారణాలతో డబ్బులు డిమాండ్ చేయడం వంటి పద్ధతులను నేరగాళ్లు అనుసరిస్తున్నారని తెలిపారు. డబ్బులు ఇచ్చిన తర్వాత లైంగిక వేధింపుల కేసులు, క్రిమినల్ కేసుల పేరుతో బెదిరింపులకు పాల్పడుతున్నారని పోలీసులు పేర్కొన్నారు. కొందరు నిందితులు పోలీసులమంటూ ఫోన్ చేసి బాధితులను భయపెట్టి భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారని తెలిపారు. ఈ కేసులో నిందితుడిపై ఐటీ చట్టంలోని 66సి, 66డి సెక్షన్లతో పాటు 308(2), 318(4), 319(2) సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. సోషల్ మీడియాలో పరిచయం లేని వ్యక్తుల ఫ్రెండ్ రిక్వెస్టులను అంగీకరించే విషయంలో జాగ్రత్తగా ఉండాలని, బెదిరింపులకు భయపడి డబ్బులు చెల్లించకుండా వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు.



# రాజభవనంలో నర్తకీమణి

‘ఎస్ఆర్ కళ్యాణమండపం’ ఫేం శ్రీధర్ గాదె దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందుతున్నది. వెంకట్ తలారి నిర్మిస్తున్న ఈ చిత్రంలో ఈశ్వర్ రాచిరాజు, నందు, నిఖిత ప్రధానపాత్రధారులు. పూజిత పొన్నాడ, సింధు కాసారం ఇతర పాత్రధారులు. ఈసినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతున్నది. ఇందులో నర్తకి పాత్రను పూజిత పొన్నాడ పోషిస్తున్నది. సోమవారం ఆమె పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ ఈ సినిమాలోని ఆమె పాత్రకు చెందిన ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. రాజభవనంలో నర్తకీమణిగా మస్తాబైన పూజిత పొన్నాడను ఈ పోస్టర్‌లో చూడొచ్చు. విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే హారర్ సినిమా ఇదని, సరికొత్త కథ, కథనాలతో సినిమా ఆకట్టుకుంటుందని, ఈ సినిమాకు సంబంధించిన టైటిల్, ఇతర వివరాలు త్వరలో తెలియజేస్తామని మేకర్స్ చెప్పారు.





# ‘బ్లడీ రోమియో’లో నాయికగా?

‘ది ప్యారడైజ్’ చిత్రంతో బ్లాక్‌బస్టర్ హిట్‌ని దక్కించుకున్న హీరో నాని తదుపరి సినిమా ‘బ్లడీ రోమియో’ కోసం సిద్ధమవుతున్నారు. సుజీత్ దర్శకత్వంలో స్టైలిష్ గ్యాంగ్‌స్టర్, రొమాంటిక్ డ్రామాగా తెరకెక్కనుంది. త్వరలో ఈ సినిమా పట్టాలెక్కనుంది. ప్రస్తుతం కథానాయిక అన్వేషణలో ఉన్న చిత్రబృందం పలువురు అగ్ర హీరోయిన్ల పేర్లను పరిశీలిస్తున్నట్లు తెలిసింది. మీనాక్షి చౌదరి పేరు ప్రముఖంగా వినిపించింది. తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రంలో ప్రీతి ముకుందన్ కథానాయికగా ఖరారైందని తెలిసింది. దర్శకుడు సుజీత్ డిజైన్ చేసిన పాత్రకు ఆమె పర్‌ఫెక్ట్ ఛాయిస్ అవుతుందని భావించిన మేకర్స్ ఆమె వైపే మొగ్గు చూపిస్తున్నట్లు తెలిసింది. అయితే ఈ విషయంలో మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ‘కన్నప్ప’ చిత్రంతో తెలుగులో మంచి గుర్తింపు తెచ్చుకుంది ప్రీతి ముకుందన్. ఈ మధ్యకాలంలో బ్లాస్ట్, ఇదయం మురళీ వంటి తమిళ చిత్రాలతో విజయాలను తన ఖాతాలో వేసుకున్నది. ఒకవేళ ‘బ్లడీ రోమియో’లో ఆమె కథానాయికగా ఖరారైతే తెలుగులో ఈ భామ కెరీర్‌కు మరింత ఊపునిస్తుందని అభిమానులు భావిస్తున్నారు.

# సంఘర్షణతో జైలర్ ప్రపంచం

ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న సూపర్‌స్టార్ రజనీకాంత్ ‘జైలర్ 2’ సినిమా ట్రైలర్ వచ్చేసింది. తెలుగులోనూ విడుదలైన ఈ ట్రైలర్ హై వోల్టేజ్ యాక్షన్‌తో రజనీ మార్క్ స్టైల్, కామెడీ, యాటిట్యూడ్‌తో ప్రేక్షకుల్లో అంచనాలు పెంచింది. దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ తనదైన శైలిలో ‘జైలర్’ ప్రపంచాన్ని మరింత భారీగా, మరింత ఆసక్తికరంగా తీర్చిదిద్దినట్టు ట్రైలర్ చెబుతున్నది. జైలర్ ముత్తువేల్ పాండియన్‌గా తలైవా మరోసారి తనదైన స్టైల్, మాస్ ప్రెజెన్స్‌తో ఆకట్టుకున్నారు. ఈ సీక్వెల్ మరింత సంఘర్షణలతో, భారీ సవాళ్లతో విస్తృతమైన ప్రపంచాన్ని ఆవిష్కరించనున్నదని మేకర్స్ చెబుతున్నారు. మోహన్‌లాల్, శివరాజ్‌కుమార్ ప్రత్యేక పాత్రలు పోషించిన ఈ చిత్రంలో రమ్యకృష్ణ, విద్యాబాలన్ కథానాయికలు. ఎస్.జె.సూర్య, యోగిబాబు, సూరజ్ వెంజారమూడు ఇతర పాత్రధారులు. సన్ పిక్చర్స్ నిర్మించిన ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ తెలుగులో విడుదల చేయనున్నది. ఈ నెల 15న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ పాన్ ఇండియా చిత్రానికి కెమెరా: కార్తీక్ కన్నన్, సంగీతం: అనిరుధ్ రవిచంద్రన్.







# మొత్తం చిత్ర పరిశ్రమను నిందించకూడదు : అమలా పాల్

సినిమాల్లో కొందరు హీరోయిన్లను అభ్యంతరకరంగా చూపించడానికి మొత్తం చిత్ర పరిశ్రమను నిందించడం సరికాదని, అది ఆయా చిత్రాల దర్శకుడు లేదా టీమ్ ఆలోచనా విధానంపై ఆధారపడి ఉంటుందని ప్రముఖ నటి అమలా పాల్ అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం పరిస్థితులు మారుతున్నాయని, మహిళా ప్రాధాన్య చిత్రాలు ఎక్కువగా వస్తుండటం శు భపరిణామమని ఆమె పేర్కొన్నారు. కొచ్చిలో జరిగిన ‘ఇండియా టుడే సౌత్ కాన్‌క్లేవ్ 2026’లో అమలా పాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా దక్షిణాది సినిమాల్లో హీరోయిన్ల పాత్రల చిత్రీకరణపై వస్తున్న విమర్శలపై స్పందించారు. “ప్రతి పరిశ్రమ నుంచి మంచి మహిళా ప్రాధాన్య చిత్రాలు వస్తున్నాయి. కాబట్టి మొత్తం పరిశ్రమను నిందించదలుచుకోలేదు. సమస్య ఏదైనా ఉంటే అది ఒక సినిమాకు లేదా దర్శకుడి ఆలోచనా విధానానికే పరిమితమై ఉంటుంది,” అని ఆమె వివరించారు. 15 ఏళ్లుగా ఇండస్ట్రీలో ఉన్న తాను ఎప్పుడూ మూస పాత్రలకు భిన్నంగా, ప్రత్యేకమైన పాత్రలనే ఎంచుకున్నానని అమలా పాల్ తెలిపారు. ఇందులో భాగంగానే 2019లో ‘ఆడై’ (తెలుగులో ‘ఆమె’) లాంటి సాహసోపేతమైన చిత్రంలో నటించానని గుర్తుచేసుకున్నారు. “ఆ సమయంలో నా ఇమేజ్ ఏమవుతుందోనని, అలాంటి పాత్రలే మళ్లీ వస్తాయేమోనని భయపడ్డాను. ఇప్పుడు వెనక్కి తిరిగి చూసుకుంటే అది చాలా ధైర్యమైన నిర్ణయంగా అనిపిస్తోంది. కానీ, ఇప్పుడు నన్ను ‘ఆడై’ లాంటి సినిమా చేయమంటే బహుశా చేయలేకపోవచ్చు,” అని ఆమె స్పష్టం చేశారు. మహిళలు తమ స్థానం కోసం కష్టపడుతున్నారని, రానున్న రోజుల్లో మరింత సానుకూల వాతావరణం ఏర్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

Printed, Published And Owned by **YAMJALA PRAVEEN**, Printed at **SRI VENKATESWARA PRINTING SOLUTIONS** 11-1/B/42, BPM Green Lands Colony, Shabari Gardens Back, Parvathapur, Medipally Mandal, Peerzadiguda, GHMC, Medchal Malkajgiri, Telangana - 500098. Published from 4-33, Near Hanuman Temple, Allapur Village, Choutuppal Mandal, Yadadri Bhuvanagiri, Telangana - 508252. **Editor : YAMJALA PRAVEEN, PRGI No: TGTEL/26/A6221,** Ph. No: 9491134365. Email id: praveenyamjala1@gmail.com, Website: www.tholivelugu.com